శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!




"ఆదర్శాల నెలవిది - ఆనంద నిలయమిది - మహిమాలయమిది"

# గురుకృప

గురుపూర్ణిమ సంచిక



# అడ్డంకులు లేని ప్రేమ

**భక్తుడు :** ఆ ప్రేమను ప్రేరేపించేది సద్గురువా?

**గురువుగారు :** అవును. మీ హృదయాన్ని తెరచి, మీలో ఆ ప్రేమను ప్రేరేపించిన ఆయనే మీకు ఓపెన్ హార్ట్ సర్జరీ కూడా చేస్తారు. (గురువుగారు నవ్వుతూ..) మీ హృదయాన్ని తెరవడం మీ పని కాదు. ఎందుకంటే మీ హృదయాన్ని మీరే తెరచి ఓపెన్ హార్ట్ సర్జరీ చేసుకోలేరు కాబట్టి.

కాకడ ఆరతిలో మొదటి కీర్తనలో (తుకారాం మహరాజ్‌చే రచించబడిన) ప్రేమకు, దానికి కావలసిన అర్హతకు గల సంబంధాన్ని వ్యక్తీకరించారు. అందులో తుకారాం మహరాజ్, "ఓ పాండురంగా, నా ప్రాణమా! నా హృదయంలో నీ పట్ల ప్రేమ ఉందో లేదో నాకు తెలియదు" అంటారు. అంటే ఆయనకు తన హృదయంలో ఉన్నటువంటిది ప్రేమో కాదో తెలియదు. ఆయన అర్హుడో, అనర్హుడో కూడా తెలియదు. ఆయనకు తన స్వామినామాన్ని గుర్తుపెట్టుకోవడమెలాగో తెలియదు. అసలు తను చెప్పేవి పిచ్చిమాటలో, ఏమో కూడా తెలియదు. ఆయన తమ సద్గురువును, "నేను ఎవ్వరైనా సరే, నా అర్హతానర్హతలు ఏవైనా సరే, నేను మిమ్మల్ని ప్రేమించినా, ప్రేమించకపోయినా సరే, మీ దయార్ద్రదృష్టి నా పైన ప్రసరించండి. మీ ప్రేమను నాకు ఇవ్వండి!" అని వేడుకుంటున్నారు. నువ్వు నన్ను ప్రేమించగలవా అని ఆయనను అడగటం లేదు. అలా కాకుండా, నీ ప్రేమను నాకు ఇవ్వు అని అంటున్నారు.

కాబట్టి, మీ హృదయంలో నిజమైన ప్రేమ జనించినపుడు మీ అర్హతానర్హతలకు చోటు ఉండదు. మీకు ఆ ప్రేమ మీద హక్కు ఉన్నట్లు అనిపిస్తుంది. ఆయన ప్రేమను మనకు అందించేది మన అర్హత కాదు. ఆ ప్రేమను ఇవ్వగలిగినటువంటి ఆయన సమర్థత అది. అప్పుడు అర్హతకు సంబంధించిన మన దృక్కోణం పూర్తిగా మారుతుంది. మనకు అర్హత ఉంది కాబట్టి మనం సద్గురుప్రేమను పొందడం జరగదు. ఆయన దయామయుడు, ప్రేమస్వరూపుడు కాబట్టి మనకు ఆ ప్రేమనిస్తారు. మన అర్హత మీద నుండి ఆయన సామర్థ్యం మీదకు దృష్టి మరల్చండి. అది చాలు.



– శరశ్చంద్రికలు నాలుగవ భాగం

సంపుటి : 23
సంచిక : 3

జూలై 5
2020



గురుకృప

# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...



ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

\- శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో


4 అవ్యాజ ప్రేమ వెలుగులు... - గురుకృప

6 పథగామి - గురుకృప

10 బ్లేడు సందేశం - శ్రీ మోపిదేవి కృష్ణస్వామి

12 వికసించే పుష్పాలు - శ్రీబాబూజీ

14 పరిచయం - 'శరచ్చంద్రికలు'

18 నమస్కారం - శ్రీబాబూజీ

22 నడయాడే సాయిరూపం - డా॥ జి. సాయివరప్రసాదరావు

27 గురుకృపాలహరి - గురుకృప




నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు

GURUKRUPA

Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info





# అవ్యాజ ప్రేమ వెలుగులు – తొలగేను చీకట్లు

"దేహానికి తప్ప దాహానికి పనికిరాని ఆ సముద్రపు కెరటాలే ఎగిసి ఎగిసి పడుతుంటే, తలచుకుంటే నీ తలరాత ఇంతే అన్నవాళ్ళు కూడా నీ ముందు తలదించుకునేలా చేయగల సత్తా నీది, అలాంటిది ఇప్పుడొచ్చిన ఆ కాస్త కష్టానికే తలొంచేస్తే ఎలా?" అంటాడు మహాకవి శ్రీశ్రీ. నిజమే. ప్రపంచమంతా ఒక మహమ్మారి వైరస్‌తో యుద్ధం చేస్తోంది. ఎన్నో వైద్య విధానాలు, ఆధునికీకరణ, విశేష విజ్ఞానం అన్నీ ఉన్నా, లక్షలాది మంది మృత్యువాత పడుతున్నారు. ఊహించని పరిణామమే. ప్రస్తుతం భూమి మీద మసలుతున్న మానవులు చూడని ఉపద్రవమే. ఈ ఉపద్రవాల చీకట్లను తమ కృపావిశేషంతో తొలగించి విశ్వమానవాళికి నవ ఉషస్సులను ప్రసాదించాలని సద్గురు చంద్రుల చరణాల తలనిడి సభక్తికంగా ప్రార్థిస్తోంది సాయిపథం కుటుంబం. ఈ సమయం–వచ్చిన కష్టానికి తలొంచేసే సమయం కానేకాదు. వెతల వెలుతులలో నిండిన సాటి మనిషిని పలకరించి, ప్రేమపంచి, సహాయమందించి మనం పొందిన సద్గురు ప్రేమను వారికీ పంచాల్సిన కీలక సమయం. **"మానవత్వాన్ని మించింది కాదు జ్ఞానం"** అంటారు పూజ్య గురుదేవులు. గురుదేవుల మాటలే మన ఆచరణల బాటలు కావాల్సిన సమయమిది. విశ్వ శ్రేయస్సును – స్వీయశ్రేయస్సుగా తలచి, అనుక్షణము ఆ ఆనందస్వరూపుని ఆశీస్సుల కోసం అర్థించాల్సిన సమయమిది.

పూజ్య గురుదేవులు వారి చెంతకు వచ్చిన ప్రతీ జీవిని సాయిప్రసాదంగా భావించి, ఆశీర్వదించి, అనుగ్రహించారు కదా! మన చెంతకు వచ్చే ప్రతీవారిని కూడా మనమూ అలానే చూసే ప్రయత్నం చేద్దాం. మనతోపాటు ఆ మహితాత్ముని చెంతకు చేరిన ప్రతీ పిచ్చుకను గమనించుకుందాం. అందరమూ వారి ప్రేమ'దారం'తో ముడిపడి ఉన్నామని మరువకుండ జీవిద్దాం. మనుషులం దూరంగా ఉన్నా మనసులను మాత్రం ఆ మహితాత్ముని ఊసులతో ప్రేమ మాగాణిగా మార్చుకుందాం. ఇదే నిజమైన వ్యాధి నిరోధకం సద్గురుపథగాములకు. మన మనోక్షేత్రాలలో శ్రీవారు వేసిన ప్రేమబీజాలు – మానవతా ఫలాలను అందిస్తున్నాయా లేదా విశ్లేషించుకునే అవకాశం ఈ విపత్కర సమయం. అల్లంత దూరాన ఉన్న ఆత్మీయ గురుబంధువులను చరవాణిలో అయినా పలకరిద్దాం. సాయివసుధైక కుటుంబంలోని ప్రతీ బంధాన్ని తలచి, తరచి చూసుకుందాం. చేయి చేయి కలుపుకొని ఎక్కడ ఏ గురుబంధువుకు ఇబ్బంది కలిగినా బాధ్యతతో ప్రవర్తిద్దాం. ధరిత్రి చూడని ఈ కష్ట సమయంలో –



సాయిమహరాజ్ బిడ్డలమన్న చరిత్రను గుర్తు చేసుకొని మసలుకొందాం. సామాజిక స్పృహతో పరిఢవిల్లే సాయిపథాన్ని ఇంకా ఇంకా నూత్న జవజీవాలతో నింపుకుందాం. ప్రభుత్వంవారు, ఆరోగ్యశాఖలు, ప్రాంతీయ పాలనా వ్యవస్థ సూచించే నియమాలను బాధ్యతగల పౌరులుగా తప్పక పాటిద్దాం. సాంఘికదూరాన్ని పాటిస్తూ మానసికదూరాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేద్దాం. వైద్య నిపుణులు అందించే సలహాలను పాటిస్తూ భవవైద్యుడైన బాబా స్మరణలో ఉందాం. ఎట్టి పరిస్థితులలోను మనకు రూఢీకాని విషయాలను సాంఘిక మాధ్యమాలలో పంచుకునే ప్రయత్నాలను విరమిద్దాం. ఆరోగ్యవంతమైన దేహం – అనారోగ్యానికి గురికాని మనసు ఈ రెండూ శ్రద్ధ వహించాల్సిన విషయాలని గుర్తిద్దాం. 'చింత' కలిగితే చెంతనున్న వారితో పంచుకొని కొంత బరువు దించుకుందాం. చెంతనలేని సన్నిహిత గురుబంధువులతో మాట్లాడి, వారి సానుకూల దృక్పథాన్ని అలవరచుకుందాం. **అల్లా–బాబాకు, బాబా–బాబూజీకి అప్పచెప్పబడ్డ పైసలం. వారి అవ్యాజ ప్రేమకు దాసులం. వారి ఆశీస్సులతో అవరోధాలను అధిగమించగల ధీరులం. అభద్రతా భావానికి అణువంత చోటు కూడా ఇవ్వకుండా జీవిద్దాం.** మన నిజమైన భద్రత మన 'గురుచంద్రులే' అన్న విషయాన్ని గుర్తిద్దాం. మరో ముఖ్యమైన విషయం – కొంత మానవ ప్రపంచం. ఆరోగ్యాన్ని 'కొని' తెచ్చుకోగల్గినా అది మనందరికీ సాధ్యం కాకపోవచ్చు కనుక, అవకాశమున్నంత వరకు సమూహ సముదాయలకు కొంతకాలం దూరంగా ఉందాం. అంతర్జాలం వేదికగా, ఎంతో ఓర్పుతో, బాధ్యతతో, సమయపాలనతో సాయినాథుని 'శృతి' – గురుదేవుల సత్సంగభాషణాలను, సాయికనెక్ట్‌ను అందించడం, ప్రసారం చేయడం జరుగుతుంది. మనందరి హర్షాతిరేకాల శుభాశీస్సులు మన సాయిపథం సాంకేతిక టీమ్‌కు అందిస్తూ సద్గురు ప్రేమామృతంలోని చివరిబొట్టు వరకు ఆస్వాదించే ప్రయత్నం చేద్దాం. ఎక్కడా అలసత్వానికి చోటివ్వక, ప్రతీ పరిస్థితిని గమనించుకుంటూ మన, మన తోటివారి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని, అందరం సమిష్టిగా ఒక నిర్ణయానికి వచ్చేవరకు సామూహిక సత్సంగ కార్యక్రమాలకు దూరంగా ఉండటం మంచిదని విన్నపం చేస్తున్నాం. అననుకూలమైన, వ్యర్థమైన పరనిందా ప్రసంగాలకు చోటివ్వక, కాలం యొక్క అమూల్యమైన విలువను గుర్తుంచుకుంటూ, సద్వినియోగం చేసుకుంటూ, సద్గురుమయం చేసుకుంటూ సాధ్యమైనంతసేపు త్రికరణాలను సాయిఊసులో, సాయిధ్యాసలో నిలుపుకుంటూ జీవితాన్ని 'నిత్యప్రార్థన'గా, అంతఃకరణాలను అంతఃశుద్ధికి, అంతర్దృష్టికి అంకితం చేసి సమర్పణ భావంతో ముందుకు సాగుదాం. **సద్గురు**





అనుగ్రహపూర్ణమైన వెలుగులు - చిక్కగా అలముకున్న ఈ చీకట్లనన్నింటిని తొలగించాలని-పల్లెలు పచ్చదనంతో, పట్టణాలు ప్రగతిరథంతో, సర్వమానవాళి ప్రేమానుబంధాల పరవశంతో, విశ్వమంతా 'ఆనందం'తో - ఆ 'ఆనందస్వరూపుని'తో మమేకమవ్వాలని మనసు ఉంచి, శిరసు వంచి సద్గురు చరణాలకు సాష్టాంగములర్పిస్తూ - విశేషంగా ప్రార్థిస్తోంది గురుకృప. - గురుకృప

## ఆనందజీవనం - సాయిపథం

**: పథగామి :**

**"సాయి అంటే ఆనందం - నన్ను ఆనందస్వరూపునిగా ధ్యానించు అని అన్నారాయన. సాయి అంటే ఆనందం, పథం అంటే మార్గం. ఇది ఆనందపథం. మనం ఎప్పుడూ ఆనందంగా ఉండటం, సాయిపథంలో ఉన్నట్లు లెక్క. సంతోషంగా ఉండండి. దుఃఖం వస్తూ ఉంటుంది. ఇబ్బంది అవుతూ ఉంటుంది. ఎందుకు ఇబ్బంది పడుతున్నాం మనం. ఇది నిజంగా సమంజసమేనా? నిజంగా అవసరం ఉందా? నిజంగా అంత కష్టం వచ్చిందా నాకు? అని ఆలోచించుకోండి. పోతుంది. ఈ విచక్షణ కావాలి, ఆ దృక్పథం కావాలి, ఆ వివేకం కావాలి. అది నిజమైన సత్సంగం అంటే. అనుగ్రహానికి మనమంతా అర్హులమే. ఆనందం మన జన్మహక్కు. బాబా అనే ఆనందాన్ని అనుభవిద్దాం, ఆస్వాదిద్దాం, అంతా వ్యాపింపచేద్దాం"** అంటారు శ్రీబాబూజీ. మన స్వరూపమే ఆనందం - ఆనందాన్ని తప్ప మరేదీ సృష్టించని మాతృత్వం సద్గురు చంద్రునిది.

**సహజంగా ఏముంది - మనలో ఏం చేరింది :** ఫలసాయం ఆశించిన రైతు సమశీతోష్ణాలను గమనించుకుంటూ దుక్కి దున్ని, విత్తుజల్లి, నీరుపోసి శ్రద్ధ వహిస్తాడు. ప్రకృతిమాత వలసిన వనరులను, పోషకాలను అందిస్తుంది. అయితే మొక్కలతో పాటు కలుపు కూడా అదే వనరులను ఉపయోగించుకొని పెరుగుతుంది. రైతు ప్రతి నిత్యం శ్రద్ధతో ఆ కలుపులను తీసేస్తాడు. మూడు రోజులు పొలంబాట పట్టకపోతే పంటంతా ముసురుకుంటుంది కలుపు. కాబట్టి అలాంటి అవకాశం ఇవ్వడు. గురువు చేసేది ఇదే - వారిది కేవలం ఫలసాయమే - మనం చేయవలసింది మధ్యలో చేరుతున్న ఈ కలుపులను తీసేయడమే. అశ్రద్ధ వహించడం వల్ల ఒక్కొక్కటిగా పేరుకుపోతే ఆ కలుపు దొంతరలను తొలగించడం కష్టతరమై పోతుంది. ఫలమివ్వడం, సఫలం గావించడమే వారి సహజగుణం. ఆ



మాతృత్వాన్ని గుర్తించలేని అసహాయత, 'అహం' స్ఫురణతో కట్టుకున్న అడ్డుగోడలను కూల్చుకోలేని నిస్సహాయత. అవ్యాజప్రేమ వర్షం కురుస్తుంటే గొడుగు అడ్డం పెట్టుకు కూర్చున్నాం. దాసగణు చెప్పిన హరికథలో సాయిబాబా గురించి విన్న పురందరే బాబాను దర్శించాలని తహతహలాడాడు. శ్రీసాయి కలలో కన్పించి పురందరేను శిరిడీ రమ్మని చెప్పారు. బిడ్డ ఆరోగ్యాన్ని కూడా సాయికే అప్పచెప్పి శిరిడీ చేరాడు. బిడ్డ ఆరోగ్యం మూడు రోజుల్లో కుదుటపడ్డా పదమూడు రోజులు ఆ ఆనందస్వరూపుని పదాల చెంతనే ఉంచేసుకున్నారు బాబా. పురందరే తల్లితో బాబా ఇలా అన్నారు – "ఏడు శతాబ్దాలుగా నాకతనితో సంబంధము ఉన్నది. అతడు రెండు వేల మైళ్ళ దూరంలో ఉన్నా అతడిని ఎన్నడూ మరువను. అతడు తినకుండా నేనేమీ తినను". ఈ మశీదులో కూర్చొని నేనెప్పుడూ సత్యాన్నే చెపుతానన్నారు శ్రీసాయి. ఎన్నో జన్మలుగా వారి బిడ్డలను కాచుకుంటూ బిడ్డకు ఆకలైతే ఆయన మనసు అల్లాడిపోయింది. బిడ్డల శ్రేయస్సు వారి ఆనందమయ్యింది. బిడ్డల 'ఆనందం' వారి ప్రేమాంతరంగమయ్యింది. ఎన్నోసార్లు పురందరే గురించి చెప్పుకున్నాం. ఎన్నిసార్లు చెప్పుకున్నా బాబా ప్రేమ ఇంకా ఇంకా నూతనత్వాన్నే సంతరించుకుంటుంది. మనల్ని ఇంకా ప్రశ్నిస్తూనే ఉంటుంది. ఎందుకు మనలో ఆ 'ఆనంద'భావన నిలిచిపోవట్లేదని? ఈనాడు కూడా బిడ్డల కలలో కన్పించి, పిలిపించుకొని వారి 'ప్రేమబంధంతో' కట్టిపడేసుకుని, కంటికి రెప్పలా కాచుకుంటున్న పూజ్య గురుదేవుల ప్రేమ పిచ్చుకలు మనకు సుపరిచితులే. ప్రేమ ప్రవాహం అప్రతిహతంగా సాగిపోతూనే ఉంది. ఎవరు బాబానో, ఎవరు పురందరేనో ఈ జన్మలో – ఆ సద్గురు చంద్రునికే ఎరుక. కరుణానుబంధంగా అన్ని కాలాల్లోనూ వారు మనతోనే ఉన్నారు. గుర్తించాల్సింది మనమే!

**ఏది నిజమైన భద్రత - ఎవరిది భాధ్యత:** "ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒకరకమైన భద్రత కోసం వెతుక్కుంటూ ఉంటారు. కొంతమంది ఆ భద్రతను సంబంధ బాంధవ్యాలలో, మరికొంతమంది కుటుంబం లేదా డబ్బులో ఇలా దేనిలోనైనా వెతుక్కుంటారు. ఈ ప్రశ్న కాస్త వింతగా ఉన్నా, నా మనసులో అడగాలనుంది. మీ భద్రత ఏమిటి గురువుగారు" అని అడిగారు ఒక పాశ్చాత్య భక్తుడు. ప్రశ్న పూర్తి అయ్యిందో లేదో గురుదేవులన్నారు **"బాబా"** అని. "అందరూ వారి భద్రతకు వేరే వేరే మార్గాలలో పొందినట్లు, మీ అవసరాలన్నీ బాబా ద్వారా తీరుతున్నట్లు మీరు అనుకుంటున్నారా?" అని అడిగితే "నాకు దేనికీ కొరతగా ఉన్నట్టనిపించదు. బాబా నాకు అన్నీ ఇస్తారు. అది భద్రతకు



మించినది. ఎందుకంటే భద్రత అనంటే మనకు ఉన్న దానిని కాపాడటం లేదా రాబోయే ప్రమాదం నుండి కాపాడటం. కానీ బాబా కోరికలు తీర్చే కల్పవృక్షం. అది (ఆ కల్పవృక్షం) మనకున్న దానిని రక్షించడం, రాబోయే ప్రమాదాల నుండి కాపాడటం మాత్రమే కాదు, మన కోరికలు కూడా నెరవేరుస్తుంది" అని మన నిజమైన భద్రతను – మాతృసాయి మన గురించి తీసుకునే బాధ్యతను తెలియచేసారు. పరిచయమున్న ఒక గురుబంధువు అనుభవం – "సుమారు 18 సం॥ల క్రితం నేను ఉద్యోగం చేస్తున్న తొలిరోజులు. అప్పటి వరకు అమ్మా, నాన్నల మీద ఆధారపడ్డ నేను వారిని డబ్బులడగకుండా జీవించాలని ప్రయత్నం చేస్తున్నా, కారణమేదైనా నాకు ఇంకా జీతం రాలేదు. ఐదువేల జీతం – అద్దింట్లో జీవితం. ఆరవతారీఖు వచ్చేసింది. క్రింది భాగంలో ఉండే యజమాని ముందు నుంచి బయటకెళ్ళాలంటే బెరుకు. ఎక్కడ అద్దె అడుగుతారో – చిన్నబుచ్చుకోవాల్సి వస్తుందని. ఎవ్వరికీ చెప్పుకోలేక ఒక్కడినే ఏడ్చేశా! ఏదో అవసరానికి క్రిందికి వెళ్ళాల్సి వచ్చింది. అంతలోనే యజమాని గారి భార్య పిలుపొచ్చింది. నాకు భయమొచ్చింది. ఏవో తినుబండారాలు చేసారు. ఎప్పుడూ బాబా, బాబా అంటుంటానని బాబాను మనసులో పెట్టుకొని, నాకు అవి పెడితే ఆవిడకు సంతోషం. బయటకు వెళ్ళి పైకి వెళ్ళేటపుడు యజమానిగారన్నారు "ఏమిటోనయ్యా! మీ తరానికి బాధ్యత తెలియదు. మూడు రోజుల నుంచి ఏదో ఒక కవరు పోస్టు డబ్బాలో ఉండిపోయింది. వర్షం పడేట్లుంది. అది తడిసిపోతే ఎలా? సరే! వెళ్ళి ఆ కవరు తీసుకెళ్ళి ఎప్పటిలాగే బాబా చరణాలకు తాకించి చూస్తే సుమారు తొమ్మిదివేల రూపాయల చెక్కు. అప్పుడూ ఏడుపే! అదేలెండి. ఆనందభాష్పాలు అంటారు. 'చెక్కు' చెదరకుండా చూసుకొనే ఆయన ఉన్నా, అవసరానికంటే ఆయనే ముందున్నా, అవగతం చేసుకోలేని, గుర్తించలేని నా అవివేకం చూసి నవ్వొచ్చింది నాకు". గురువెప్పుడూ భద్రతనూ, బాధ్యతను రెంటినీ తీసుకుంటూనే ఉన్నారు. మన అవగాహనే సమగ్రంగా లేక అనవసర వ్యర్థాల్నీ, అంతులేని భారాన్ని మోసుకుంటూ వెళ్తున్నాం. కల్పవృక్షం నీడన ఉన్నామన్న 'గురుతే' కలతలకు చోటు లేకుండా చేస్తుంది.

**అనంత ప్రేమకు చిరునామా - వారికి చేరువవుదామా?:** మానవుణ్ణి పూజించడానికి సందేహించిన రేగేతో – తన పాదాలపై సాష్టాంగపడిన వెంటనే "ఏమిటి, మానవుణ్ణి పూజిస్తావా?" అని ప్రశ్నించి, సంఘర్షణను రగిలించి చివరకు కౌగిలించుకుని, దగ్గర కూర్చుండబెట్టుకుని "నీవు నా బిడ్డవు. ఇతరులున్నప్పుడు మేము బిడ్డలను దూరంగా ఉంచుతాము" అని తమ సహజమాతృత్వాన్ని చూపారు



సాయి. రేగే సాహెబ్‌కు శ్రీసాయితో ఏర్పడిన అనంత ప్రేమానుబంధాన్ని గుర్తుకుతెచ్చే సంఘటన. బాబా ఒకనాడు మశీదులో ఒంటరిగా ఉండగా ఒక వ్యక్తితో రేగేను పిలిపించుకుని దగ్గరగా కూర్చోబెట్టుకుని “నా ధనాగారం తాళం చెవి నీ చేతిలో ఉంచుతున్నాను. నెలకు ఐదు రూపాయలుగాని, వంద రూపాయలుగాని, ఇంకేదైనాగాని నీకు ఏది కావాలంటే అది అడుగు ఇచ్చేస్తాను” అన్నారు. అడగక మౌనంగా ఉన్న రేగేను గడ్డం పట్టుకు బ్రతిమాలారు అడగమని. అయితే నేను ఏది అడిగితే అది ఇస్తారా? అన్నాడు రేగే. ‘ఆ! ఇస్తాను’ అన్నారు బాబా. “అయితే బాబా, ఈ జన్మలోనూ, ముందు ముందు రానున్న జన్మలన్నింటిలోను మీరు నన్ను విడువకూడదు. మీరు నా చెంతనే ఉండాలి. ఇదే నాకు కావలసినది” అన్నాడు రేగే. “సరే తప్పకుండా, నేనెప్పుడూ నీ చెంతనే, నీలోనూ, నీకు వెలుపలా ఉంటాను – నీవెలా ఉన్నా, యేం చేస్తున్నా సరే,” అని మాట ఇచ్చారు బాబా. బాబా తన మాటను దృఢపరచడానికి భౌతికరూపంలో కూడా దర్శనమిచ్చేవారు. **భగవంతుడు – భక్తుడిని వేడుకునే క్రమం అందామా? బిడ్డను తల్లి గోముగా అడిగే సందర్భమందామా? ఇది ఒక ఆధునిక అనంతప్రేమ ఇతిహాసం – భక్తుల ఆనంద చంద్రికా దరహాసం.** పూజ్యగురుదేవులు కూడా శ్రీసాయిని వారి సంరక్షకునిగా, తల్లిగా, తండ్రిగా, దైవంగా వర్ణిస్తూ బాబాను కేవలం ‘సద్గురువు’ అన్న పదానికి పరిమితం చేయడానికి మక్కువ చూపే వారు కాదు. ఆ బంధానికి ఏదో ఒక పరిమితమైన పేరు కంటే ఏదో ఒక ఉన్నతమైన అవ్యక్తానుబంధం వారి మాటల్లో దర్శనమిచ్చేది. నిజమే కదా! పేరు పెట్టే బంధమా ఇది. బిడ్డల కోసం కాపలాదారుడయ్యాడు, ఇబ్బంది పడే అలవాట్లు మాన్పించడానికి మూగజీవమై దెబ్బలను కాచాడు. సృష్టిని శాసించాడు – ప్రేమను శ్వాసించాడు. తన బిడ్డల కోసం. చివరకు కోపించే సమయంలో కూడా వారి పాదాల చెంతనే పాతిపెట్టుకునేంత అనంతానంత ప్రేమ. విన్న పదాలు, ప్రోగు చేసుకున్న భావాలు మనకు సద్గురు చంద్రునితో ఉన్న ప్రేమానుబంధంలో పరిమితులను సృష్టిస్తున్నాయేమో ఆలోచిద్దాం. పదాల పరదాలను తొలగించుకుని, ‘అహం’భావాల అడ్డుగోడలను కూల్చుకుని, వ్యర్థమైన, అసహజమైన ఏ అలవాట్లు మనలను బద్ధులను, బద్ధకస్తులను చేస్తున్నాయో వాటన్నింటికి పాతర వేసే ప్రయత్నం చేయడం ఎంతైనా అవసరం. మన గురువుకు దగ్గరయ్యే ప్రతీ అడుగు – అనవసర అంశాలకు దూరంగా వేసే అడుగు అని గమనించుకుందాం. సహజంగా మనం ఆనందస్వరూపులమని – వారి లీలా వినోదంలో పాత్రలమని – వారిచ్చిన ప్రతీపాత్రను ఔచిత్యంతో నిర్వహించాలని అర్థం చేసుకుందాం.



'దుమ్ము, ధూళి లేని ఇనుపముక్కను అయస్కాంతం ఇట్టే ఆకర్షించగలుగుతుంది' అంటారు శ్రీరామకృష్ణులు. సద్గురు సంప్రదాయానికి విరుద్ధమైన ఏ దుమ్ము, ధూళిని పేరుకోనివ్వకుండా అవ్యాజప్రేమ అయస్కాంతానికి చేరువవ్వడం మన ముందున్న మార్గం. "మీకు గనుక సామర్ధ్యముంటే, ధైర్యం ఉంటే, నన్ను ఉపయోగించుకునే సమర్ధత ఉంటే పూర్తిగా వినియోగించుకోండి" అంటారు శ్రీబాబూజీ. వారికి చేరువవుదాం – వారిని పూర్తిగా ఉపయోగ పెట్టుకుందాం – జీవితాలను పరిపూర్ణం చేసుకుందాం. తండ్రికి తగ్గ బిడ్డలమయ్యే ప్రయత్నం చేద్దాం.

***– గురుకృప***

## బ్లేడు సందేశం

ఆ రోజు రాత్రి రచనా వ్యాసంగం కోసమని మాస్టరుగారు, నేను వారి ఇంటికి దగ్గరలో ఉన్న మరొకరింటిలో బసచేశాం. పడుకునేటప్పటికి రెండు గంటలు దాటింది. మెలుకువ వచ్చేటప్పటికి మాస్టరుగారు పక్కపై కన్పించలేదు. సమయం ఐదు గంటలవుతోంది. గబగబా మాస్టరుగారింటికి వచ్చేటప్పటికి మాస్టరుగారు లోపలి గదిలో గడ్డం చేసుకుంటున్నారు. రెండు మూడు నిమిషాలు సల్లాపాలు నడిచిన తర్వాత మాస్టరుగారు అన్నారు గదా, "కృష్ణస్వామీ నాకిప్పుడే ఒకటనిపించిందోయ్. నువ్వు తట్టుకుంటానంటే చెబుతాను" అన్నారు.

"తప్పక చెప్పండి, నేనా నిర్ణయాన్ని నా నుండి చూడకుండా మీ నుండి చూస్తాను. అప్పుడు తప్పకుండా తట్టుకోగలను" అన్నాన్నేను.

"ఈ సంవత్సరానికి కోడూరు గురుపూజలు ఆపేస్తే ఎలా ఉంటుంది" అంటూ నా కళ్ళలోకి చూశారాయన, నా మమకారం కరిగిందో లేదోనని.

"మీకేది సబబనిపిస్తే అదే చేద్దాం"

"కొంచెం వ్యామోహపడకుండా చూడు – గురుపూజలు మొదలు పెట్టి నాలుగేళ్ళయింది కదా, మీ ప్రాంత ప్రజలు మీ కుర్రవాళ్ళంతా పని చేస్తుంటే సినిమా చూస్తున్నట్లు చూస్తున్నారు తప్పు జరుగుతున్న దాని యెడల తమ బాధ్యత ఏమిటో గుర్తించారా? **పాల్గొనేవారి సంఖ్య** చూసి మీరు మురిసిపోతున్నారు, **పాలు పంచుకునేవారి సంఖ్య** ఏడాది నుండి ఏడాదికి ఏ మాత్రం పెరుగుతున్నదని నేను చూస్తున్నాను. ఎవరో, ఎక్కడనుండో వచ్చి గురుపూజలు జరుపుతున్నారు, మనం సర్కసులాగానో, సినిమాలాగానో చూద్దామనుకుంటున్నారు తప్ప, ఈ గురుపూజలు మనవి. జరుగుతున్నవి మనకోసం,



జరుపుకోవలసింది మనం అని ఎంతమందికి మేలుకొలుపు కలిగిందంటావ్? మీరు వాళ్ళ మేలు కోరి పెట్టారుగాని, వాళ్ళు మాత్రం మేలుకోవడం లేదు. మీ కుర్రాళ్ళు మాత్రం గురుపూజలనే సర్కసుఫీట్లు చేసి తుక్కయిపోతున్నారు. కృష్ణస్వామిగారు, కృష్ణమాచార్యగారు కథ నడుపుతున్నారట. అని దూరం దగ్గర అనుకోకుండా వివిధ ప్రాంతాల నుండి సోదర బృందం వారు తరలివచ్చి కనీస సౌకర్యాలు లభించీ లభించక కోడూరులో దిగ్బంధమయి పోతున్నారు. ఎందుకీ శ్రమంతా? ఇన్ని ఊళ్ళవాళ్ళను ఈడ్చుకురావడమెందుకు? మన కుర్రవాళ్ళు మనతో కలిసి గడపాలి అంటే దానికి వేరే ఏర్పాటు చేద్దాం. ఇంత తతంగం అక్కరలేదు.

"వ్యామోహపడకు. మీ ప్రాంతం మేలుకోరిన నీ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ మాట చెబుతున్నాను. గురుపూజలు మీకుగా తలపెట్టకండి. మీ సేవా కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగించండి. నిన్ను నమ్మి నీ తోడిదే ఒక జీవితమనుకున్న యువకుల జీవితాలను తీర్చిదిద్ది స్థిరపరిచే ప్రయత్నంలో ఉండు. మనకెప్పుడూ గురుపూజే. లేనిదెప్పుడు?"

నిజంగా ఈ ప్రాంత ప్రజలకు గురుపూజలు, వాటి అనుభూతి కావాలో, అక్కరలేదో వాళ్ళే తేల్చుకుంటారు. వాళ్ళు ఏ నిర్ణయానికి వచ్చినా బెంగలేదు. ఒకవేళ వాళ్ళకు గురుపూజలు కావాలనిపిస్తే వాళ్ళనే ఏర్పాటు చేసుకోమనండి. మీరు వాళ్ళ ఉత్సవంలో వాలంటీర్లుగా పనిచేయండి. ఉత్సవం వాళ్ళది అని తెలుసుకొన్ననాడు గురుపూజలు మళ్ళీ జరుగుతాయి. తెలుసుకొనేలోపల మీ మానాన మీరు ముందుకు సాగడమే కర్తవ్యం. సిద్ధపడని వారిని గూర్చి ఆలోచించి ఆర్భాటం చేసేకన్నా సిద్ధపడినవారి విషయంలో నీ కర్తవ్యాన్ని గుర్తించి ముందుకు సాగు.

"ఏం కృష్ణస్వామీ? తేరుకున్నావా?" అన్నారాయన.

"తెలుసుకున్నాను" అన్నాన్నేను.

"నేనూ తెలుసుకున్నాను" అన్నారాయన.

ఆశ్చర్యంతో చూశాన్నేను ఎక్కడినుండి ఎలా తెలుసుకొన్నారని.

"అసలు విషయం చెబుతాను చూడు. నీకు నేను అందించిన సందేశం నాకు అందించినవాడు వేరొకడున్నాడు" అంటూ ప్రక్కనున్న బ్లేడును తీసి చూపించారు, నాకేమీ బోధపడలేదు.

"ఏం బోధపడలేదా? జరిగిన కథ చెబుతా విను, గడ్డం గీసుకుందామని కూర్చున్నాను. బ్లేడు రేజరుకు తగిలించాను. ఎంత గీసినా గడ్డం తెగదే! నాలుగైదుసార్లు ప్రయత్నించాను. బ్లేడు తీసి



ప్రక్కన పెట్టక తప్పలేదు. ప్రక్కన పెడుతుంటే కోదూరు గుర్తుకు వచ్చింది. నాలుగైదుసార్ల నుండి ప్రయత్నం సాగుతున్నా కోదూరు మాత్రం ఈ బ్లేడు లాగానే ఉండిపోయిందే అనుకుంటూ క్రొత్త బ్లేడు తీస్తుంటే ఇంతలో నువ్వు వచ్చావు. అదీ ఈ బ్లేడు సందేశం! బాగుందా!" అన్నారు మాస్టారు.

**"బాగుంది, మమ్మల్ని బాగుచేసేలా ఉంది.** మా ముందుతరం తెగని బ్లేడులా మీ చేతి నుండి ప్రక్కకు చేరితే, మా తరం మీ చేత స్వీకరింపబడిన క్రొత్త బ్లేడులా మీ ప్రణాళికకు సహకరించగలదు".

"గ్రహించావు గదా, అయితే ఇహ క్రొత్త బ్లేడు మీద దృష్టిపెట్టు. నీ చుట్టూ చేరిన యువతరాన్ని తీర్చిదిద్దడంలో నీ కాలాన్ని వినియోగించు. ఇక నేనక్కరలేదు. నీ వక్కరలేదు. నీ చేతిలో తయారైన యువకులే మీ ప్రాంత ప్రజలకు దారి చూపగలరు." **– శ్రీ మోపిదేవి కృష్ణస్వామి**

# వికసించే పుష్పాలు

**గురుబంధువు :** గురువుగారూ, సత్సంగాలకు వెళ్ళినపుడు చిన్నపిల్లల్ని తీసుకువెళ్తే వేరే వాళ్ళ ప్రశాంతతకు ఇబ్బంది అవుతుందని మనం సత్సంగాలకు వెళ్ళకుండా ఉండాలా?

**గురువుగారు :** అవకాశం ఉండి, పిల్లల్ని ఎవరైనా చూసుకునేదానికి, వెసలుబాటు ఉంటే అక్కడ వదిలిపెట్టి పోవడం కరెక్ట్. వాళ్ళని హింసబెట్టడం ఎందుకు? వాళ్ళకి ఏం అర్థమవుతుంది పాపం. వాళ్ళు గోల చేస్తారు అంటే అందులో వాళ్ళ తప్పేమీ లేదు. కానీ అక్కడకొచ్చినటువంటి ఉద్దేశ్యం వేరే! ఆ ఉద్దేశ్యం చెడిపోకూడదు. పిల్లలు తెలియకే ఏడ్చి ఉండవచ్చు గాక. కానీ తెలిసి మనం సత్సంగాన్ని చెడుపుకోకూడదు కదా. కాబట్టి రెండింటినీ సమన్వయపరిచే పద్ధతిలో ఏదైనా ఉంటే చూడండి. పిల్లల్ని నిద్రపుచ్చడం లేదా అవకాశం ఉంటే ఎవరికైనా అప్పచెప్పి రావడం, అలా చేయండి.

***ప్రేమను వ్యక్తపరచడం :*** ఇప్పుడు పిల్లలున్నారు సింపుల్‌గా ఊరికే అడుగుతుంటారన్న మాట. బజారుకు పోతే నాకా టోపీ కొనిపించవా? నాకా బొమ్మ కొనిపించవా అంటారు. ఓకే అని చెప్పి బొమ్మ కొనిపించావనుకో, అవతల పారేస్తాడు. అంతే. దాన్ని ఆడుకోరు, పెట్టుకోరు, అంత ప్రాణం తీసి కొనిపించావే అంటే వాళ్ళకు అడగటంలో ఏంటి? పేరెంట్స్‌పట్ల, ఉండేటువంటి ఆప్యాయతకి ఒక వ్యక్తీకరణ అది. ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ లవ్. మనమేం చేస్తాం దాన్ని అర్థం చేసుకోకుండా మొన్న నేను కొనిచ్చాను, నువ్వేమో ఆడుకోలేదు, నీకేం కొనివ్వను పో అనంటాం. ఇది నీకొక పెద్ద



ఆటయిపోయింది నువ్వు ఊరికినే అడుగుతావు. వాటితో ఆడుకోవు అక్కడ పారేస్తావు అనంటాం–తప్పది. ఆ అడిగితే–మనం ఇవ్వడంలోనే అది ఫుల్‌ఫిల్ అయిపోయింది. వాడు ఆడుకోవడంలో కాదు ఉండేది అక్కడ. మనకు తెలుసు ఆ బొమ్మ యొక్క విలువ. అదెంత, ఎన్ని డాలర్స్ అన్నది దాని యొక్క విలువ ఏంటి అనే విషయం మనకు తెలుసు. పిల్లలకు తెలియదది. వాడికి కావాల్సింది ఏమిటి–మా ఫాదర్‌ని, మా మమ్మీని అడుగుతాను. మా మమ్మీ నాకిస్తుంది, ఆ ఇవ్వడంలోనే వాడికి లోపల సంతృప్తి. అది మనం అర్థం చేసుకున్నపుడు వాడిని తిట్టం. Do you know how many dollors it is? అంటాం మనం. వాడికి ఎన్ని డాలర్స్ అని తెలుసుకోవాల్సిన అవసరం లేదు. how many dollors అని వాడిని అడిగారంటే ..you are not a good parent. ఎందుకనంటే ఆ అడగటంలో వాడు మా నాన్న నాకు అడిగింది ఇస్తాడు అని. ఆ అడగడంలో ఉన్నదాన్ని ఎన్ని డాలర్స్ పెట్టినా మీరు కొనలేరు. ఆ నమ్మకాన్ని, ఆ ప్రేమని. అట్లా మనం బాబాని కూడా అడుగుతుంటాం. ఆయనిస్తుంటాడు, మళ్ళా అడుగుతుంటాం. ఇదంతా కూడానూ ప్రేమ అనేటువంటి ప్రిన్సిపుల్ మీద పోతుంది అంతే. దీనికేం రూల్స్ లేవు. నువ్వు ఇది చేసినందువల్ల బాబా అది ఇస్తారు అనేదానికి ఏం లేదు.

**గురుబంధువు :** గురువుగారూ, మా పక్కింటావిడ ఇట్లా అడిగినపుడు కొని ఉంటే పిల్లలు పాడైపోతారు, ఈ పని చేస్తే ఇది కొనిస్తాను అని కండీషన్ పెట్టాలి అంటుంది. నువ్వు అట్లా నువ్వు పాడుచేస్తున్నావు పిల్లాడిని అని అంటుంది.

**గురువుగారు :** మంచిది, బాబా కూడా అలానే అంటారు నీతో. నువ్వు ఇది చేస్తే అది నీకిస్తా. లేకపోతే నేను చెయ్యను అని అంటాడు. అప్పుడు నీకు ఎలా ఉంటుంది? నువ్వేం బాబావయ్యా? మేము ఏమి చేసినా మీ పిల్లలం బాబా. మాకివ్వు బాబా అని అంటాం. మనదగ్గర కొచ్చేసరికి మాత్రం అది చేస్తే ఇస్తాను అనడం కరెక్టేనా?

**గురుబంధువు :** కొన్ని కొన్ని ఎంతో ఖరీదైనవి అడుగుతారు కదండీ మరి?

**గురువుగారు :** ఏమ్మా, ఎక్స్‌పెన్సివ్?

**గురుబంధువు :** వాళ్ళకి ఎట్లా చెప్పాలండీ అది?

**గురువుగారు :** ఒక్కొక్కరికి ఒక్కోరకంగా చెప్పాలి. అలాగే అని చెప్పండి. మాయ చేయండి. ఆర్డర్ చేసాను, వస్తుంది అని చెప్పండి. ఏం తప్పులేదు. పిల్లలు వాళ్ళు మర్చిపోతారు. ఇందాకే నేను



చెప్పా! వాళ్ళకి కావల్సినటువంటిది ఆ వస్తువు కాదు. **"అడగటం-ఇవ్వడం"** అనేటువంటిది. ఈలోపు ఇంకో వస్తువుని చూస్తాడు, అది అడుగుతాడు. అది కొనివ్వండి. దాంట్లో ఏం తప్పులేదు, నేను కూడా చెప్పా! ఎందుకు చెప్పలా? నేను చాలా మాయ చేస్తున్నా అలాగా! నా తప్పేం లేదు.

**గురుబంధువు :** వాళ్ళు అడిగినపుడు అన్నీ కొనిచ్చేస్తే పాడైపోతారా?

**గురువుగారు :** ఏం పాడవ్వరు. నా అనుభవంతో చెప్తున్నా, అట్లా ఏం పాడవ్వరు, నేను మా పాపకి అడిగినవన్నీ కొనిచ్చా, ఇప్పటివరకు నో అని ఎప్పుడూ ఏమీ చెప్పలా, నాకు తెలిసి ఏం పాడవ్వలా!

**– శ్రీబాబూజీ, సాయిపథం**

# పరిచయం

**(పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ సత్సంగాలలో వెల్లివిరిసే సాన్నిధ్యపు పరిమళాల ఆనంద చంద్రికలు)**

"సత్సంగానికి పునాది ప్రేమ, అది అందుకు ఇందుకు అని కాదు. ఒకరిని (సద్గురువును) చూసినపుడు ఎందుకో మనసులో తెలియని ప్రేమ, ఆయన దగ్గర కూర్చున్నా ఆయన గురించి ఆలోచించినా మనస్సులో తెలియని ఆనందం కలుగుతుంది. అదేమిటో తెలియదు, ఎందుకు వస్తోందో తెలియదు. ఏదో తెలియని భద్రత, "నా జీవితాన్ని ఆయన చూసుకుంటాడు" అనే భద్రత. ఎందుకు చూసుకుంటాడో తెలియదు, మనలో ఏం అర్హతలున్నాయని చూసుకుంటాడో తెలియదు. దీని ద్వారా ప్రేమ కలుగుతుంది. ఆయన గురించి వినాలి, ఆయనను చూడాలి, ఆయనకు ఇష్టమైన రకంగా ఉండాలి అనే తపన బయల్దేరుతుంది. ఆ తపనకు ప్రతిరూపంగానే మనం సత్సంగానికి వెళతాం."
–శ్రీబాబూజీ

సత్సంగం అనే సంస్కృత పదానికి 'సత్ పదార్థంతో సాంగత్యంలో ఉండటమ'ని శబ్దార్థం. ఈ అర్థంలో చూస్తే 'సత్సంగం' యొక్క పరిధి విస్తృతంగా ఉంటుంది. సద్గురు సాంగత్యం, సద్గ్రంథ పఠనం, సత్పురుషుల చరిత్ర పారాయణ, సత్ప్రబోధాల అధ్యయనం, మనన శ్రవణాదులు, భజనలు, సంకీర్తనలు, స్వాధ్యాయ ప్రవచనాలు, సత్యాన్ని గురించిన చర్చ, గురువు ముఖతా సంశయనివృత్తి మొదలైన వాటినన్నింటినీ సత్సంగం యొక్క రూపాలనే చెప్పవచ్చు. ఇలా సత్సంగానికి ఎన్ని రూపాలున్నప్పటికీ, సత్స్వరూపులైన సద్గురు సాన్నిధ్యంలో శిష్యునికి **ఆనందానుభూతి**ని సంప్రాప్తింప



చేసేదే నిజమైన సత్సంగమని ఉపనిషత్ ప్రోక్తరూపాన్నే సదా ప్రామాణికంగా భావించడం జరుగుతుంది.

సత్సంగం ఎందుకు?.... అనేది తరువాత ఉదయించే ప్రశ్న. సాంప్రదాయానుసారం, సత్సంగం – జీవన సాఫల్యానికి ఉపయుక్తమైన జ్ఞానాన్ని ప్రబోధించడం, అంతరంగంలో పరివర్తన కలిగించడం అనే రెండు విధులనూ నిర్వర్తించాలి. సద్గురు ప్రబోధం వాచా బాహ్యంగా జరిగితే, మహిమాన్వితమైన వారి పవిత్ర సన్నిధి హృదయంలో పరివర్తన కలిగిస్తుంది. సుజ్ఞాన శోభితమైన సద్గురు ప్రబోధాలు సాధకునిలో సాధనా స్ఫూర్తిని రగిలిస్తే, వారి సన్నిధి (ప్రత్యక్ష సన్నిధైనా లేక పరోక్ష దివ్య సన్నిధైనా) అంతరంగాన్ని క్షాళన చేసి శాంతిని, సంతృప్తిని అందిస్తుంది. ఇలా సద్గురు సన్నిధిని అందిస్తూ, ఆ సాన్నిధ్య నేపథ్యంగా ప్రబోధామృతాన్ని పంచేదే నిజమైన సత్సంగం.

సత్సంగానికి నేడు వాడుకలో ఉన్న వ్యావహారికమైన అర్థం సత్సంగాన్ని కేవలం ప్రబోధాలు, ప్రవచనాలకు మాత్రమే పరిమితం చేస్తోంది. ఇందులో సత్సంగానికి మూలాధారమైన సద్గురు సాన్నిధ్యాన్ని గురించిన ప్రస్తావన ఉండదు. సదాసత్స్వరూపులైన సద్గురుమూర్తుల సన్నిధి లభ్యం కావడం అరుదు గనుక చాలా వరకు సత్సంగాలు కేవలం వారి ప్రబోధాల పఠనానికి, ప్రవచనాలకు మాత్రమే పరిమితం కావడం జరుగుతుంది. సద్గురు ప్రబోధాలకు నేపథ్యమైన వారి సన్నిధి గొప్పతనాన్ని, భక్తుల హృదయాలలో ఆ సాన్నిధ్యం నింపే శాంతిని, సంతృప్తిని మాటల్లో వర్ణించడం, పదాలలో పొందుపరచడం సాధ్యపడదు. కాబట్టి గ్రంథకర్తలు, ప్రసంగకర్తలు ప్రబోధాలను 'విడమరచి' చెప్పినంతగా సాన్నిధ్యపు మహాత్మ్యాన్ని తెలియచేయలేరు. **సర్వాత్మకమైన సద్గురుసన్నిధిని గురించిన ప్రస్తావన లేకపోతే – అన్ని పరిమితులకూ అతీతమైన సత్స్వరూపానుభూతిని మానవాళికి అనుభవైకవేద్యం చేస్తూ, మనిషి మనుగడకు ఆలంబన కావాల్సిన సత్సంగాలను కేవలం సిద్ధాంత ప్రబోధాలకు, తాత్విక ప్రవచనాలకు పరిమితం చేసినట్లవుతుంది.**

శ్రీమతి తర్ఖడ్ 1911వ సంవత్సరంలో శ్రీసాయిబాబాను ప్రప్రథమంగా దర్శించినపుడు సాయినాథుని దివ్యసన్నిధిలో ఆమెకు అనుభవమైన అపూర్వ శాంతి ఆనందాలు, భద్రతాభావం గురించిన ఆమె స్మృతులు – మాటల ప్రమేయం లేని మహత్తర సత్సంగానికి ఒక అద్భుతమైన ఉదాహరణ. భూతభవిష్యద్వర్తమానాలు తెలిసిన సర్వజ్ఞులని భక్తులు తెలుసుకొంటారు. "బాబాను ఒకసారి దర్శించిన తరువాత వారికి సర్వస్య శరణాగతి చెందడం కన్నా చేయవలసినది మరేదీ



ఉండదు.”

శ్రీమతి తర్ఖడ్ యొక్క ఈ అనుభవం సత్సంగంలో సద్గురుసన్నిధి ప్రభావాన్ని ప్రస్ఫుటంగా తెలియచేస్తుంది. అక్కడ శ్రీసాయి వాచా చేసిన ప్రబోధమంటూ ఏమీ లేదు, ఒక్కమాట కూడా మాట్లాడలేదు. కానీ ఆ ప్రభావం నిరుపమానం. మహిమాన్వితమైన సాయినాథుని సన్నిధిలో మాటల అవసరమే లేకపోయింది. ఆయన సన్నిధే మనోవాక్కులకు అతీతమైన సత్యాన్ని దర్శింపచేస్తుంది. శ్రీసాయి సన్నిధిని చేరిన ఎంతోమంది అనుభవం ఇటువంటిదే అనడానికి శ్రీఖాపర్డే, శ్రీమతి తర్ఖడ్ వంటి భక్తుల అనుభవాలే నిదర్శనం.

ఆధ్యాత్మిక శాస్త్రాలలో చెప్పినట్లు ప్రపంచంలో ప్రతి జీవి సచ్చిదానంద స్వరూపమే కావచ్చు, కానీ ఆ నిజస్థితి సద్గురురూపంలో మాత్రమే పరిపూర్ణంగా వ్యక్తమవుతుంది. దీపంతోపాటు వేడి, వెలుతురు ఎట్లా అయితే కలిసే ఉంటాయో, **సద్గురు సాన్నిధ్యంలో ప్రేమ, కరుణ, జ్ఞానం, శాంతి, అనుగ్రహం సమన్వితమై ఉంటాయి.** సద్గురు ప్రత్యక్ష (భౌతిక) సాన్నిధ్యంలోనే కాక వారు భౌతికదేహాన్ని విడిచిపెట్టిన తరువాత కూడా వారి సమాధి స్థానాలు భక్తులకు ఆ ప్రత్యక్ష సాన్నిధ్యానుభూతిని అందిస్తే, ఆ సద్గురుమూర్తుల జీవిత చరిత్రలు – వారి బోధనలను, దివ్య సన్నిధిని ప్రసాదిస్తాయి. ఓ మహాత్ముని మహాసమాధి ఆయన అవతార కార్యం మరింత విస్తృతం కావడానికి, వారి మహిమ ప్రవర్ధమానమవడానికి సూచిక. ఆసక్తికరంగా, సద్గురు సన్నిధి మన హృదయంలో పరివర్తన ఎలా తీసుకొని వస్తుంది? మన అహంకారాన్ని ఇనుపముక్కతోను, సద్గురువును అయస్కాంతంతోను, సద్గురు సన్నిధిని అయస్కాంత క్షేత్రంతోనూ పోలుస్తూ శ్రీబాబూజీ ఇచ్చిన అద్భుత సాదృశ్యం ఈ గ్రంథంలోని నాలుగవ అధ్యాయంలో కనిపిస్తుంది. దాన్ని క్లుప్తంగా చూద్దాం.

“మనమంతా ఇనుపముక్కల్లాంటి వాళ్ళం. అయస్కాంతానికి, ఇనుపముక్కకూ ఉన్న తేడా ఏమిటి? అయస్కాంతం విషయంలో దానిలోని అణువులన్నీ క్రమపద్ధతిలో సరిగ్గా ధృవీకృతమై ఉంటాయి. ప్రతి అణువుకు ఉత్తరధృవం, దక్షిణధృవం ఉంటాయి. వాస్తవానికి అవి అలా ధృవీకృతం కావించబడి ఉంటాయి. ఇదే ఇనుపముక్కలో అణువులు ధృవీకృతమై ఉండవు. అక్కడ ధృవాలుగానీ, క్రమంగానీ ఉండదు. కాబట్టి ప్రతి అణువు యొక్క అయస్కాంత క్షేత్రానికి మరొక అణువు అయస్కాంత క్షేత్రం ప్రతికూలంగా పనిచేస్తుంది, ప్రతిఘటిస్తుంది. నిజానికి ఇనుములోని ప్రతి అణువు అయస్కాంతత్వాన్ని కలిగి ఉంటుంది. అక్కడ అయస్కాంత శక్తి ఉంటుంది. కానీ అది వ్యక్తం కాదు, నిరోధింపబడుతుంది,



అది అణిచివేయబడుతుంది. అయస్కాంతంలో అది వేరేవిధంగా ఉంటుంది. పైకి చూస్తే అది సరిగ్గా ఇనుము మాదిరిగానే ఉంటుంది. మార్పేమీ ఉండదు. కానీ ప్రతి అణువు ఓ క్రమపద్ధతిలో, అమరికతో ఉత్తరం నుండి దక్షిణంవైపుకు ధృవీకృతమై, కేంద్రీకరింపబడి ఉంటుంది. మన అంతరంగంలో, మనం కూడా ఆ ఇనుప అణువుల మాదిరిగానే ఉంటాం. మనలో ఓ క్రమంగానీ, కూర్పుగానీ లేని చాలారకాల ఆకర్షణలున్నాయి – ఈ ఆకర్షణలు, కోరికలు అన్నీ ఒకదానితో ఒకటి సంఘర్షించేటటువంటి అణువులవంటివి. ఇలా వివిధ రకాల పాశాలు మనల్ని వివిధ దిశల నుండి లాగుతుంటాయి., అందువల్ల ఆ అయస్కాంతత్వం పోయింది. కాబట్టి ఓ ఇనుపముక్కను అయస్కాంతం చేయడం ఎలా? – దానిని నిరంతరం అయస్కాంతాన్ని (సద్గురువును) అంటిపెట్టుకొని ఉండేలా చేయడం ద్వారా, అయస్కాంతం మీద తిరిగి తిరిగి రుద్దడం ద్వారా అయస్కాంతంలా చెయ్యవచ్చు.

నిజంగా అంటిపెట్టుకొని ఉండటమంటే ఆ అయస్కాంత క్షేత్రంలో ఉండటమే. నిజానికి ఇనుపముక్కను అయస్కాంతంగా మార్చేది ఆ అయస్కాంతం కాదు, దాని క్షేత్రం. అవును, ఆ పోలికలో అది శక్తి క్షేత్రమే. అది మరొకటి కూడా కావచ్చు. అది ఓ ప్రేమ క్షేత్రం కూడా కావచ్చు. ఎందుకంటే నిజానికి ఇక్కడ ప్రభావితం చేసేది ఆ ప్రేమే. ఇనుపముక్కల విషయంలో అయితే అది కేవలం ఆ అయస్కాంత శక్తి క్షేత్రమే. కానీ మనం ఇనుపముక్కలం కాదు. మనం మనుషులం. మనకు హృదయముంది. అందులో భావోద్వేగాలున్నాయి. మనం ఆ క్షేత్రాన్ని ప్రేమ అనే భావోద్వేగంలా అనుభూతి చెందుతాం. ఎక్కడైతే ఆ భావోద్వేగం మరింతగా ప్రజ్వరిల్లుతుందో, అది మరింత పెరిగి బలీయమవుతుందో, మీరు ఎక్కడైతే దానిని మరింతగా అనుభూతి చెందగలుగుతారో, అది అయస్కాంత క్షేత్రం, సద్గురు సన్నిధి!" అని వివరించారు శ్రీబాబూజీ.

ఈ 'మనోనిశ్చల'భావాన్నే దాసగణు మహారాజ్ తమ ఆరతి గీతంలో వ్యక్తం చేసారు. ఈ విషయాన్ని గురించి ఈ గ్రంథం యొక్క మొదటి అధ్యాయంలో శ్రీబాబూజీ ఇలా ప్రస్తావిస్తారు. "మనం బాబా ఆరతిలో **'థక్ గయీ మేరీ రసనా'** అని పాడుకుంటాం, అంటే 'నేను మూగబోయాను' (నా నాలుక అలసిపోయింది) అని. నిజానికి తమను తాము మరచిపోయినపుడు కలిగేటువంటి విస్మృతభావాన్ని (నిశ్చేష్టిత భావాన్ని) దాసగణు వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి సాయిసన్నిధి ప్రభావం అంత అమోఘమైనది.

– **'శరశ్చంద్రికలు'** – రెండవ భాగం





# నమస్కారం

**గురువుగారు :** నమస్కారం అంటే 'న'-'మ'-ఆస్కారం అంటే 'నేను' లేక 'నాది' అనే వాటికి ఆస్కారం లేదు అని దాని అర్థం. ఏ స్థితిలో నేను, నాది అనే వాటికి ఆస్కారం ఉండదో అది నమస్కారం. అంతేగాని 'అతను నాకు నమస్కారం చేశాడా?" లేకపోతే "అతను ఈరోజు నాకు నమస్కారం చేయలేదు" అని కాదు. అది నమస్కారానికి పూర్తిగా విరుద్ధమైనది! మన అహంకారం మరియు నేను, నాది అనే భావన సద్గురు పాదాల క్రింద అణగిపోవాలని మనం ప్రార్థిస్తాం కదా (ప్రార్థించమా?) కాబట్టి మనం నమస్కారం చేసిన ప్రతిసారి అటువంటి భావోద్వేగం, వినమ్రభావం కలగాలి. ఆ నమస్కారానుభవాన్ని ఉజ్జీవం చేసుకోవడానికి ఆ భావాలను మరింత బలీయం చేసుకోవాలి. అది సాష్టాంగ నమస్కారమైనా, పాదనమస్కారమైనా, మీరు చేసే మరే ఇతర నమస్కార రూపమైనా – నమస్కారమనే ఆచారవిధి వెనుక గల ఉద్దేశ్యం ఇదే.

**భక్తుడు :** మీరు చెప్పిన వివిధ నమస్కారాలు ఏమిటి?

**గురువుగారు :** హృదయం ముందు అరచేతులను జోడించడం, నమస్కారం (అంజలి), పూజనీయులు లేదా మహాత్ముల పాదాలను స్పృశించడం– పాదనమస్కారం, సాష్టాంగ నమస్కారం అంటే శరీరం యొక్క మొత్తం ఎనిమిది అంగాలను నేలపై ఆనించడం. అందువలన ఏ అవయవం కూడా ఉన్నత స్థాయిలో ఉండదు. శిరస్సు మాత్రమే కాదు, శరీరంలోని మొత్తం అవయవాలన్నీ నేలపై సమతులంగా ఉంటాయి. ఇంగ్లీషులో "He fell flat infront of him" (ఇతను ఆయన ముందు సాగిలపడ్డాడు) అంటారు కదా అలాగన్న మాట. దానర్థం ఏమిటంటే అతని అహం అంతా పోయింది, ఇంకేమీ మిగలలేదు. మనకు కావలసిందీ అదే. కానీ సవ్యమైన రీతిలో మనం అటువంటి వినమ్రతను కోరుకునేటప్పుడు, మనకటువంటి కోరిక ఉన్నప్పుడు ఎన్నిసార్లు అనే ప్రశ్న ఎక్కడిది? వాస్తవానికి అటువంటి నమస్కారమనేది నిరంతరం జరగాలి. అప్పుడు నిరంతర నమస్కారస్థితిలో ఉంటారు. అందుకే ముస్లింలు నమాజు చేసేటప్పుడు ఒక చిన్నగుడ్డను తలమీద కప్పుకుంటారు – ఎవరి దివ్యత్వమైతే తమ శిరస్సులపై ఉందో, అటువంటి భగవంతుని (అల్లా) క్రింద తాము ఉన్నామన్న దానికి సంకేతంగా! ఇదే కారణంతో బాబా తలమీద గుడ్డను ధరించేవారు.

**భక్తుడు :** వాళ్ళు తమ తలపై ఏదైనా ధరిస్తారా?

**గురువుగారు :** అవును, వారికి వినమ్రతాభావాన్ని అనుభూతి చెందడానికి దోహదం చేసే ఒక



అచ్ఛాదనమది. అందుకనే నమాజు చేసేటప్పుడు తమ తలపై కప్పుకుంటారు. ఫకీరు అంటే నిరంతరమూ నమాజు చేస్తూనే ఉండేవారు, రోజుకు నాలుగైదుసార్లు మాత్రమే కాదు, ఆయనెప్పుడూ నమాజు స్థితిలోనే ఉంటారు, అందువల్ల ఆయన తమ తలపై ఎప్పుడూ కప్పుకునే ఉంటారు.

**భక్తుడు :** నిజానికి, మేమంతా పాదనమస్కారం కోసం ఆతృతగా ఎదురుచూస్తూ ఉంటాము. అటువంటి అవకాశం గనుక వస్తే, మేము ఆ అవకాశాన్ని వదులుకోము అనుకుంటూ ఉంటాము. అయితే పాదనమస్కారం యొక్క ప్రాముఖ్యత ఏమిటి? మా భక్తికి అది ఎలా సహాయపడుతుంది? ఎంత తరచుగా అది అవసరమవుతుంది? దీని గురించి కాస్త వివరిస్తారా?

**గురువుగారు :** వాస్తవానికి పాదనమస్కారం అనే ఆచారం వెనుక గల అంతరార్థమేమిటంటే, మన శరీరంలోని అత్యున్నత భాగమైన శిరస్సును అన్నింటికన్నా క్రింద స్థానానికి తీసుకురావడం. క్రింద స్థానం (క్రిందికి), అంటే ఏ స్థాయికి? – సద్గురువు పాదాల చెంతకు. మనం ఆయన ముందు, ఆయన పాదాల చెంత మనం అన్నింటికన్నా తక్కువవారమని, వినమ్రులమని ఆయనకు తెలపడానికి అలా చేస్తాం. కాబట్టి మన శరీరంలోని అత్యున్నత భాగాన్ని సద్గురువు యొక్క అథోభాగమైన పాదాల వద్దకు తీసుకువస్తాం. తలను ఆయన (సద్గురువు) పాదాల దగ్గర ఉంచడం, పాదాలను స్పృశించడం అనే ఆచారం అలా వచ్చింది. నీ తలను సద్గురువు పాదాల వద్ద ఉంచాల్సిన అవసరం నీకున్నంత వరకు నువ్వు దానిని వీలైనంత తరచుగా చేస్తుండాలి. నిజానికి అది (తల) నిరంతరం అక్కడే (పాదాలవద్ద) ఉండాలి. ఎంత తరచుగా అన్నది కాదు. ఎప్పుడూ మన శిరస్సు సద్గురు పాదాల దగ్గరే ఉండాలి. ఈ అంగముద్రలన్నీ మన ఎఱుకను మరింత స్పష్టం చేసుకోవడానికి సహాయపడతాయి. అన్ని ఆచారాల వెనుక ఉండే అంతరార్థం ఇదే. “ఒక్కసారి చేస్తే సరిపోతుందా!” – చాలదు! అది ఆ ఎఱుకను కలిగించడానికి, దానిని ఇంకా ఇంకా ఎక్కువ చేసుకోవడానికి మాత్రమే. అంతే! దానికున్న ఏకైక అర్థం అదే. అసలు నిజమైన నమస్కారమంటే బాబా పాదాలు ఎప్పుడూ మన తలపై ఉన్నాయి అన్న ఎఱుకే! దానిని బాహ్యంగా చేయడమన్నది మన అంతరంగంలోని ఆ అనుభవానికి అభివ్యక్తీకరణ మాత్రమే. అన్ని పూజా (ఆచార) విధులు ఇటువంటివే.

**గురువుగారు :** బాబా ఫొటోను చూసిన ప్రతిసారీ నమస్కరించాలా అని అతను అడుగుతున్నాడు. బాబా ఫొటోకు నమస్కారం చేయకుండా ఉండటానికి పరిష్కారం ఏమిటంటే, నువ్వు బాబా ఫొటోను





చూడనప్పుడు కూడా నిరంతరం నమస్కారం చేస్తూండటమే. నువ్వు హృదయంలో గనుక ఎప్పుడూ నమస్కరిస్తూ ఉంటే అప్పుడిక బాహ్యంగా నమస్కరించాల్సిన అవసరం ఉండదు. కాబట్టి ఎప్పుడూ నిరంతర నమస్కార స్థితిలో ఉండండి. అప్పుడు మాత్రమే బాహ్యమైన వ్యక్తీకరణ అవసరం ఉండదు. అలా కాకపోతే మీరు తప్పనిసరిగా నమస్కరించాలి. నేను చేస్తాను. దానిలో తప్పేమీ లేదు. మీ ఆఫీస్‌లో పై అధికారిని చూస్తావు, అతను నీవైపుగా వస్తూ ఉంటాడు. నువ్వు "నమస్తే సార్" అని చెప్తావు. చెప్పరా మీరు? అలా చెయ్యడానికి నువ్వేమీ సిగ్గుపడవు. బాబా దగ్గరకు వచ్చేటప్పటికీ అది మనకు సమస్యగా ఉంటుంది! అలా ఉండకూడదు. నేను నమస్కారం చేస్తాను.

**గురువుగారు :** ఆధ్యాత్మికానుభూతి పొందాలనుకునే చాలామంది ఆలోచనలన్నింటినీ, మన భావోద్వేగాలన్నింటినీ, అన్ని సంస్కారాలను, అన్ని వాసనలను వదలిపెట్టి మనల్ని మనం ఖాళీ చేసుకోవాలి. మనం నిర్మలంగా ఉండాలి, మనం చా...లా ఖాళీగా ఉండాలి! అని అనుకొంటూ ఉంటారు. ఈ శూన్యత (ఖాళీ) యొక్క ప్రయోజనం గురించి మనకు ఒక అస్పష్టమైన అభిప్రాయం ఉంటుంది. కానీ అలా అన్నీ వదులుకోవడం మనకు ఇష్టం ఉండదు. నిజానికి దానిని (ఆ శూన్యతను) మనం ఎదుర్కోలేము. అందులోని పరస్పర వైరుధ్యం, ద్వైదీభావం అదే. కాబట్టి మొదట మనకు ఈ శూన్యం గురించి తెలియాలి. అందుకే నేను శూన్యం అన్న పదాన్ని వాడను, నేను దానిని ఎప్పుడూ పరిపూర్ణత్వమంటాను. మనం పూర్ణంగా నిండిపోవాలి. దేనితో? సంతోషంతో, ఆనందంతో, తృప్తితో. కానీ అక్కడ ఖాళీ ఉండాలి. మనం చాలా ఖాళీగా ఉంటాం. కానీ దేనినీ లోపలికి రానివ్వం. అదెలాగంటే, ఒక పాత్రలాగా అన్నమాట. ఒక పాత్రను తీసుకోండి. మీ స్నానాల గదిలో ఈ ప్రయోగం అందరూ చేయవచ్చు (నవ్వులు). ఒక పాత్రను నీళ్ళున్న బొక్కెనలో తలక్రిందులుగా, నిట్టనిలువుగా 90 డిగ్రీలలో ముంచండి. ఆ పాత్ర ఖాళీగానే ఉన్నప్పటికీ, ఒక్క చుక్క నీళ్ళు కూడా లోపలికి పోవు. ఎందుకని? అది ఖాళీగా ఉంది కాబట్టి. మనకు తెలిసినంతవరకు అది ఖాళీనే. కానీ అది నిట్ట నిలువుగా ఉంది. కాబట్టి అప్పుడు మనం కొంచెం ఒక్క డిగ్రీ వంచితే నీళ్ళు లోపలికి వస్తాయి. ఇంకొంచెం, ఇంకో డిగ్రీ వంచితే మరికొన్ని నీళ్ళు లోనికి వస్తాయి. మరొక డిగ్రీకి మరికొద్ది నీళ్ళు. కాసేపటి తరువాత నువ్వు వంచాల్సిన అవసరం లేదు. ఎందుకంటే నీళ్ళు లోపలికి త్రోసుకు వచ్చేస్తాయి. మిగతాది తనంతట తానుగా నిండిపోతుంది. మనమంతా పాత్రలలాంటి వాళ్ళం.



అనుగ్రహానంద మహితజలాలలో తలక్రిందులుగా ఉంచబడిన పాత్రలం. కొన్నిసార్లు బాబా "మీరందరూ తలక్రిందులుగా ఉన్న (బోర్లించిన) కుండలలాంటివారు" అని చెప్పింది దీని గురించే. మనందరి గురించి ఆలోచించినపుడు, ఎందుకు ఆయన సరిగ్గా ఆ సారూప్యమే చెప్పారో నాకు మనసుకు వస్తుంది. మనమంతా ఖాళీ కుండలవంటి వాళ్ళం, కానీ మనం పూర్తిగా తలక్రిందులుగా ఉన్నాం. ఆయన మనలో ఏదైనా పోయాలని అనుకున్నా, లేదు, మనం దానికి ఒప్పుకోం. మనం చాలా గట్టిగా తొణక్కుండా ఉంటాం కాబట్టి ఏమీ లోపలికి వెళ్ళదు. మనం చేయవలసిన ప్రయత్నం ఏమిటంటే కాస్త నాలుగైదు డిగ్రీలు ఒరగడానికి కృషి చేస్తే మిగతా దాని గురించిన బాధ్యత తీసుకోబడుతుంది. మొత్తం సమస్యంతా ఆ నాలుగైదు డిగ్రీలతోనే వస్తుంది.

**భక్తుడు :** కానీ గురువుగారు! ఈ నాలుగైదు డిగ్రీలు ఒరగడం మేము చేయాలి కదా? దానిని మేమెలా చేయగలం?

**గురువుగారు :** శూన్యత్వస్థితి గురించి భయపడకుండా ఉండి, అనుగ్రహసాగరంలో నువ్వు నిజంగా తలక్రిందులుగా ఉన్న కుండవని తెలుసుకున్నప్పుడు ఇక అక్కడ ఏం చెయ్యాల్సిన అవసరం లేదు. జరగవలసింది సవ్యంగా జరిగిపోతుంది. కానీ సమస్యేమిటంటే "మేం ఖాళీగా ఉన్నాం, లోపలికేం రావట్లేదు, మేము ఇక్కడ ఎన్నో కష్టాలకోర్చి, ఇలాగే చాలా రోజుల నుండి ఉన్నాం, సముద్రంలో ఉన్నా – ఇంకా ఖాళీగా ఉన్నాం". మనం నిజంగా ఖాళీగా ఉన్నామా? లేదు, మనలో నిండా గాలి ఉంది (గురువుగారు నవ్వుతూ) గాలి కూడా ఉంది, కానీ మనం ఆ గాలిని ఇష్టపడం. దానిని (తలక్రిందులుగా ఉన్న కుండని) కాస్త వంచండి. అప్పుడు బుడబుడమని బుడగలు వస్తాయి. ఇదే మీకు కలిగే ఆధ్యాత్మికానుభవాలు! (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు :** కానీ మమ్మల్ని మేము ఎలా వంచుకోగలం?

**గురువుగారు :** నేను మీకు చెప్పాను! మీరు ఒక పాత్ర అని మీరు తెలుసుకుంటే, మీరు వంచబడతారు, లోపలికి నెట్టుకొని రావడానికి ప్రయత్నిస్తున్న ఆ (నీటి) ఒత్తిడిని ఎంతోకాలం ఆపలేము. ఆ అవగాహన కలిగినప్పుడు, హఠాత్తుగా పాత్ర తిరిగిపోతుంది, అప్పుడు మీరంటూ మిగలరు. కానీ నువ్వు బలవంతంగా, పాత్రని పట్టుకుని ఉన్నావు. "నీళ్ళేవీ లోపలకు రావడం లేదు. ఏమీ లేదు" అని అడుగుతున్నావు, ఫిర్యాదు చేస్తున్నావు. దానిని అలా పట్టుకొని ఉన్నపుడు లోపలికి నీరెలా వస్తుంది? నీటికి శక్తి లేదు. కొంతకాలం తరువాత అలా పట్టుకోవడంలో నువ్వు అలసిపోయినపుడు, నిన్ను





నువ్వు నిటారుగా ఉంచుకునేందుకు అశక్తుడవైనప్పుడు నీరు లోపలికి వస్తుంది. అందుకనే ఆ అశక్తతను, అసహాయతను అనుభవించవలసి వస్తుంది. దాని వలన మనం కొంచెం వంచబడటం, వంగడం జరుగుతుంది. మనం బాబా ముందు సాష్టాంగపడినప్పుడు జరిగేది అదే. నువ్వు వంగుతున్నావు, నీ పాత్ర ఒరుగుతోంది. అది గుర్తుంచుకోండి. అలా ఒక్కొక్క డిగ్రీ ఎక్కువయ్యే కొద్దీ అనుగ్రహజలం అంత ఎక్కువగానూ లోపలికి వస్తుంది. అదీ నమస్కారం. ఇలా ఇక్కడకు వచ్చి నా ముందర వంగి ఉండటం కాదు. నేనెప్పుడూ మీరు మీ పాత్రను వంచుతారని. కొద్దిగా ఎక్కువగా పంచుతారని ఆశిస్తాను. **– 'శరశ్చంద్రికలు' మొదటి భాగం**

## నడయాడే సాయిరూపం

### ఆ చేయి ఎంత హాయి...

తద్విద్ధిప్రణి పాతేన పరిప్రశ్నేన సేవయా... అన్న వ్యాసభగవానుల మార్గమువైపుకు నా బుద్ధిని మరలించాను. అంతకన్నా మిన్నయైన మరో మార్గము నాకు తోచలేదు.

**ప్రశ్న :** "బాబా" భక్తునిగా ఎవరైనా ఎలా కాగలుగుతారు.

**జవాబు :** అందులో "వాని" ప్రయత్నమేమీ లేదు. ఆ ఎంపిక "బాబా"దే.

**ప్రశ్న :** పోనీ "బాబా" అనుగ్రహము పొందడానికి అర్హత ఏమిటి?

**జవాబు :** "బాబా" అంటే ఇష్టముండాలి. "బాబా"ను ప్రేమించగలగాలి. ఆరాధించటమూ, ఆధారపడటమూ, వీటికంటే మించిన అర్హతలు ఏముంటాయి

**ప్రశ్న :** ఈ అర్హత... ఆధారపడటమంటే ఏమిటి?

**జవాబు :** నన్ను "బాబా" కాపాడినంత చక్కగా ఇంకెవరు రక్షించలేరు. "బాబా"కు శరణాగతి చెందడము. అన్నింటా "బాబా"యే దిక్కు. ప్రతిదీ "బాబా" పరంగానే జరుగుతుందనే పరిపూర్ణ విశ్వాసము ఉండాలి. ఏ ఆధారమూ లేని వానిని చూచి మీరెలా జాలి పడతారో అలానే మనకు "బాబా"యే ఆధారమను భావన కలగాలి. (అర్ధంకాని రీతిగా ప్రశ్నార్ధకంగా మారిపోయిన నా వదనమును చూచారు. చిరునవ్వు నవ్వారు, "అమ్మయ్య" అని ఊపిరి పీల్చుకొనినాను).

**ప్రశ్న :** సార్! కొంచెము విశదముగా వివరించగలరని నెమ్మదిగా నసిగాను. గురువుగారు నా పరిస్థితికి జాలిపడి....



**జవాబు :** అడపాదడపా, మన ఇళ్ళకు బిచ్చగాళ్ళు వస్తారు కదా! ఎలాంటి బిచ్చగానికి మీరు భిక్ష వేస్తారు.

**ప్రశ్న :** భిక్షము వేయడానికి కూడా అర్హత ఉండాలా?

**జవాబు :** బిచ్చము వేయడానికి అర్హత అంటే ఆ భిక్షము తీసుకునే వ్యక్తిని దృష్టిలో పెట్టుకొని ఆలోచించండి.... అర్థం కాలేదుగదా! (నిజానికి నాకు అర్థం కాలేదు.) బాగా బలంగా ఉండి, ఎగుభుజాలు, పిక్కలు ఎగదన్నుకొని బలిష్టంగా ఉండి మధ్యవయస్కుడైన యువకుడు సోమరిపోతు భిక్షావృత్తిలో బ్రతుకుదామని బయలుదేరి, ఇంటింటి ముందు యాచిస్తే, ఎందరు అతనికి భిక్ష ఇస్తారో చెప్పు. పైగా ఏమంటారో ఊహించు. ఈసారి జవాబు చెప్పడం నా వంతైంది.

**నా సమాధానము :** భిక్షము వేయకపోగా, ఏం రోగం నాయనా? దున్నపోతులా ఉన్నావు, కాలొంకరా, చెయ్యొంకరా? అడుక్కోడానికి సిగ్గులేదూ! కష్టం చేసుకోరాదూ! నాలుగిళ్ళలో పాచిపని చేసుకున్నా నీ పొట్ట గడిచిపోతుందే! కాఫీ హొటల్లో కప్పులు కడిగైనా సుఖంగా బ్రతకొచ్చే. రోజువారీగా కూలికి వెళ్లినా తేలిగ్గా రూ.10లు సంపాదించుకోవచ్చని అంటాను.

**గురువుగారు :** కదా మరి, నాలుగైదు ఎకరాల పొలముండి, లక్ష రూపాయల బ్యాంకు బ్యాలెన్స్ ఉండి, పెట్టుబడిలేని వ్యాపారమని భిక్షకు వస్తే అతని విషయం తెలిసిన వారు ఏం చేస్తారు?

**నా సమాధానము :** అసహ్యించుకుంటారు.

**గురువుగారు :** అవును గదా! ఎలాంటి భిక్షగాణ్ణి మీరు ఏవగించుకున్నారో గుర్తుంచుకోండి...... అలానే 90 సంవత్సరాల వయసుండి, బాగా వృద్ధాప్యముండి లేవలేక లేస్తూ, పడుతూ, చస్తూ బ్రతుకుతున్న బిచ్చగాణ్ణి చూస్తే మీకేమనిపిస్తుంది.

**నా సమాధానము :** జాలి వేస్తుంది.

**గురువుగారు :** కాళ్ళు, చేతులు సక్రమంగా లేకుండా, పాకుతూనో, పారాడుతూనో, చక్రాల బండిమీదో ఉండే భిక్షగాణ్ణి చూస్తే?

**నా సమాధానం :** జాలి వేస్తుంది

**గురువుగారు :** ఒక వ్యక్తి చాలా నీరసంగా ఉండి, అయ్యా, నేను భోజనం చేసి మూడు దినాలైంది. ఇంత అన్నం పెట్టించండి అని దీనంగా ప్రాధేయపడి అడిగాడనుకో, ఏం చేస్తారు.

**నా సమాధానము :** తప్పకుండా అన్నం పెట్టిస్తాను.



**గురువుగారు :** అడుక్కునే వ్యక్తి ఘరానాగా మీకు ముక్తి కలిగేందుకు అవకాశమిస్తున్నాను... డైరెక్టుగా స్వర్గానికెళ్ళే ఛాన్స్ ఇస్తున్నాను, ధర్మం చేసుకోండి అని అడిగితే

**నా సమాధానం :** ఛస్తే పైసా కూడా ఇవ్వను

**గురువుగారు :** పై వ్యక్తికి ఇవ్వడానికి కారణమేమిటి? రెండో వాడికి ఇవ్వకపోవడానికి కారణమేమిటని ఆలోచిస్తే, అడిగిన విధానము. ఆధారపడిన తీరు అని అర్ధమవుతుంది. దారిలో మనం వెళు తున్నపుడు మూర్ఛరోగి ఒకడు హఠాత్తుగా మూర్ఛ వచ్చి నేలపై పడి నురగలు క్రక్కుతూ చేతులూ, కాళ్ళూ దబదబామంటూ కొట్టుకుంటూ లేవలేక దభీమని క్రిందకు పడిపోయినప్పుడు మీరంతా చూస్తే ఏం చేస్తారు.

**నా సమాధానం :** తప్పకుండా ఆదుకుంటాము. పదిమందిని పిలిచి బక్కెట్లకు బక్కెట్లుగా నీళ్ళు పోసి త్రాగినన్ని నీళ్ళు పోసి ఆపైన తోచింది చేతిలో పెడతాము.

**గురువుగారు :** అంతేగదా... ఓ వ్యక్తి రోడ్డుపై నిలబడి "బాబూ" నేను పుట్టు గ్రుడ్డివాణ్ణి, రోడ్డుదాటలేనివాణ్ణి, అసహాయస్థితిలో ఉన్నవాణ్ణి దయుంచి జాలిగల మహానుభావులు నా చేయిపట్టుకొని రోడ్డు దాటించండని దీనంగా అడిగితే ఏం చేస్తారు?

**నా సమాధానము :** తప్పకుండా దాటిస్తాము

**గురువుగారు :** అదే విధంగా.... ఆ దాటించిన వాడు మహానుభావుడో, కాదో, మనకు తెలియకపోయినా ఆ అడిగిన విధానము ఆ వ్యక్తికి జాలి గొల్పి ఉంటుంది. ఆధారపడటమంటే ఎలా ఉంటుందో, "బాబా"ను ఎలా అర్ధించాలో బోధపడిందనుకుంటాను. ఆధారములేని వాని స్థితి ఎలా ఉంటుందో మనకు అవగతమైతే కదా! "బాబా"పై మనం ఎలా ఆధారపడాలో అర్ధమయ్యేది.

**ప్రశ్న :** అంటే మేమంతా... అంటూ వక్రంగా అడగబోతున్న నన్ను వారించారు.

**గురువుగారు :** నీవేమి అడగబోతున్నావో నాకు తెలుసు. బిచ్చమేసే మహరాజు "బాబా"యే అయినపుడు ఆయన ముందు జోలి తగిలించుకొని భిక్షాపాత్రను చేతపట్టుకోవడానికి సిగ్గు పడవలసిన పనేలేదు. ఆయన ముందు నేను బిచ్చగాడిని. ఆయన వేసేది ఏదైనా నాకిష్టమే. ఆయన తిని రాల్చిన ఎంగిలి మెతుకైనా నాకు పెన్నిధితో సమానమే అన్నారు శాంతంగా, గాంభీర్యంగా గురువుగారు. నేను ఎలాంటి ప్రశ్న వేయబోతానో ముందుగానే వారికి తెలిసింది. ఆ విషయములో మనకెలాంటి



సంశయము లేదు. వేలాది పుస్తకాలను చదివిన రీతిగానే వారి సన్నిధికి వచ్చే లక్షలాదిమందిని, వారి హృదయాలను, వారి వారి మనోగత భావములను వారవలీలగా చదువుతున్నారు.

చంద్రమతి మాంగల్యము హరిశ్చంద్రునికి మాత్రమే కన్పించిన రీతిగా, వారియందు సాష్టాంగ నమస్కారము చేసుకొనబోయేముందే మనమేమిటో, మన సంస్కారమేమిటో, మన వాసనలు ఏమిటో, ఎందుకు వచ్చామో! ఏమడగాలనుకుంటున్నామో! సర్వమూ మనకన్న ముందుగా ఆ మహనీయునికి సద్గురు స్వరూపునికి తెలిసిపోతుంది. "బాబా"కు ఎలా తెలిసేదో, అలానే మన గురువుగారికి కూడా తెలుస్తుంది. ఒకసారి ఇలాగే ఏమైందో వివరిస్తాను. చాలా దూర ప్రాంతము నుండి ఓ భక్తురాలు బాబా సన్నిధిలో పారాయణ చేయాలని శిరిడీకి వచ్చింది. వచ్చిన తరువాత గురువుగారి గురించి విని వారిని దర్శించడానికి వచ్చింది.తాను ఏ పుస్తకమును "బాబా" సన్నిధిలో పారాయణ చేస్తే బాగుంటుందో గురువుగారిని అడిగింది.

అమ్మా! నీవు నిజంగా నేను చెప్పిన పుస్తకాన్నే పారాయణ చేయాలని అనుకున్నదానివైతే నేను చెప్పిన తరువాతనే పుస్తకాన్ని తెచ్చి పారాయణ చేస్తావు. నీవు ముందుగానే, నీ ఆలోచనలకు అనుగుణంగానే ఎవరో చెప్పిన పుస్తకాన్ని పారాయణ చేయాలని తెచ్చావు. ఆ పుస్తకమే చదవాలనుకున్నావు. దాన్నే ఇక్కడకు తెచ్చావు. ప్రస్తుతం అది నీ చేతి సంచిలో ఉంది. కావాలనుకుంటే చూడు. ముందేది చదవాలని ఆప్యాయంగా తెచ్చుకున్నావో, ఆ పుస్తకాన్నే పూర్తిచేయి అన్నారు గురుదేవులు. ఆమె నమస్కరించి వెళ్ళిపోయింది. ఆమె ఉద్దేశ్యమేమిటో నాతోపాటు మీ అందరికీ అర్థమైందనుకుంటాను. ఆమె తెచ్చుకున్న పుస్తకాన్ని కాకుండా గురువుగారు ఇంకొకటి చెప్పినపుడు ఆమె చదివితే మంచిదే. ఏ ఫలితమును ఆశించి ఆమె ఆ పని చేస్తుందో త్వరితగతిన ఫలము లభిస్తుంది. అలా కాకుండా భిన్నంగా చేస్తే, ఆమెకు "దోష"మన్నది సముత్పన్నమౌతుంది.

ఓ మహాత్ముణ్ణి, అవతారపురుషుణ్ణి, కారణజన్ముని మనంతట మనమే వారిని సలహా అడిగినపుడు, నీ ఇష్టాఇష్టాలతో నిమిత్తముండదు. ఎందుకంటే "మనకేది మంచిదో–మనకేది చెడో" మనకంటే బాగా మనస్వామికెరుక. కొన్ని సమయాలలో మహాత్ములు మన మనుకున్న దానికి భిన్నంగా చెప్పవచ్చు. వారు చెప్పిన విధానము మనకు రుచించక, మనమనుకొనిన దానికనుకూలముగా సాగిస్తాము. అందువలన ఇబ్బందులెదురౌతాయని మహాత్ముల చరిత్రలు నిర్ధారించుతున్నాయి. బాబాను దర్శించిన



భక్తులు తిరిగి వెళ్ళుటకు అనుమతిని అర్థించగా తొందరేముంది భోజనం చేసి వెళ్ళమన్నారు. బాబా చెప్పినట్లుగా భోజనము చేసి వెళితే వారనుకున్న బండికి వెళ్ళలేక పోవచ్చని రైలుకు వెళ్ళే తొందరలో "బాబా" మాటను పాటించక ముందుగా రైల్వేస్టేషన్‌కు వెళ్ళిన కొందరు భక్తులకు రైలు ఆలస్యమై తినేందుకు ఏమీ దొరకక పస్తుండి ఇబ్బంది పడినారని, బాబా అనుమతిని పాటించిన వారు హాయిగా భోజనము చేసి వారు ఎక్కవలసిన రైలును ఎక్కినారు. ఈ విషయాన్ని మనం సాయిచరిత్రలో చూడగలం – ఇలాంటివి ఎన్నో సంఘటనలున్నాయి. అందుకనే మహాత్ములతోను, మన గురువుగారి వంటి కారణజన్మునితోను, 'నడయాడే సాయిరూపమైన' శ్రీబాబూజీగారితో నీ మనోగత భావాన్ని స్పష్టముగా చెప్పాలి. లో భావన వారి ముందు మంచిది కాదు.

**గురువుగారు :** బాగా ఆకలౌతున్నవాడు ఇంటికి వచ్చి, వాళ్ళమ్మను భోజనము వడ్డించమనే విధానాన్ని గమనించండి. ఓ అయిదు నిమిషాలాగు అంటే ఆగగలడా? ఆగనంటాడు. పప్పు, కూర సాంబారు చేసి వడ్డిస్తానంటే ఏమంటాడు? ఏదుంటే అది పెట్టు అని అడుగుతాడు. అలా "బాబా"ను అడగగలగాలి. అంతటి అవసరం, శ్రద్ధ, నీలో కలగాలి. అంతేగాని, ఆధారపడటమంటే కాళ్ళు, చేతులు, కళ్ళు పీకేసుకోవడం కాదు. బిచ్చమడిగిన వాని అర్థమైన రీతిగానే, "బాబా"ను అడిగేవాడు ఎలా ఆధార పడ్డాడో తెలుస్తుంది బాబాకు.

**ప్రశ్న :** ఈ భావాన్ని మరి కొద్దిగా విశదపర్చగలరు. ఆ అర్హత నాకు రావాలంటే వస్తుందా?

**గురువుగారు :** నీకేమిటి? ఎవ్వరికైనా వస్తుంది.

**ప్రశ్న :** అలా రావాలంటే సులభమైన ఉపాయాన్ని చెప్పండి సార్... మిగిలిన వివరాలు వచ్చే సంచికలో వివరిస్తూ మాటల మధ్యలో అందమైన కథలను సందర్భానికి అనుగుణంగా **"నడయాడే సాయిరూపం"** ఎలా వివరిస్తారో ఎదురుచూద్దాము.

**డా॥ జి. సాయివరప్రసాదరావు, రేపల్లె**

*ఒకరోజు శ్రీరామకృష్ణులకు అమూల్యమైన ఒక శాలువను మథుర్ బహూకరించాడు. ఆనందంగా దానిని శ్రీరామకృష్ణులు స్వీకరించారు. శాలువ కప్పుకొని, ఆలయ ఉద్యానవనంలో పచార్లు చేస్తూ ఎదురైన ప్రతి ఒక్కరికీ దానిని చూపిస్తూ చిన్న పిల్లాడిలా సంతోషించారు. దాని ఖరీదు వేయి రూపాయలని చెప్పడం మాత్రం ఆయన మరువలేదు. కానీ కాసేపట్లోనే ఆయన మనోభావం మారిపోయింది. విచక్షణాయుతమైన ఆయన మనస్సు ఇలా ఆలోచనలో మగ్నమైంది: "ఈ శాలువలో ఏం ఉంది? గొర్రె ఉన్ని తప్ప. ప్రతి వస్తువులా ఇదీ ద్రవ్యరాశి పరివర్తనే కదా! నిస్సందేహంగా చలి నుండి ఇది రక్షిస్తుంది. ఒక రజాయి లేదా ఒక దుప్పటి సైతం ఆ పని చేయగలదు. ఇతర భౌతిక వస్తువుల మాదిరి భగవత్సాక్షాత్కానికి ఇది దోహదం చేయదు. పైగా దీని సొంతదారునిలో ఆధిక్యభావాన్ని జనింపచేస్తుంది. తాను సంపన్నుడననే గర్వం తలెత్తుతుంది. కనుక ఇది ఆ వ్యక్తిని భగవంతునికి దూరం చేస్తుంది." ఈ ఆలోచనను శ్రీరామకృష్ణులు భరించలేక పోయారు. వెంటనే ఆ శాలువను నేల మీదికి విసిరేసి, కాళ్ళతో త్రొక్కుతూ దాని మీద ఉమ్మసాగారు. పిదప అగ్గిపుల్ల గీచి శాలువను తగులబెట్టబోయారు. ఇంతలో ఎవరో వచ్చి శాలువను లాగేసుకొని వెళ్ళిపోయారు. శాలువకు పట్టిన దుర్గతి గురించి విన్న మథుర్ నవ్వి, "బాబా, సరైన పనే చేశారు" అన్నాడు.*

**- దైవంతో సహజీవనం నుండి**



# గురుకృపాలహరి

**నీ కథామృతము నిరతసేవన నాకు చేకొనుట సకల సుఖసేవనంబటుగాన!**

సద్గురుదేవా! నువ్వు గుర్తుకు వచ్చే ఊసు, నువ్వు మనసున నిలిచేందుకు ఉపయోగపడే ధ్యాస కంటే ఈ సృష్టిలో ఏది గొప్పగా ఉంటుంది? ఎటువంటి అనుభూతినైతే అక్షరాలు చెప్పలేక మూగపోయాయో, ఎట్టి ఆనందాన్నైతే యోగి పుంగవులు సైతం తమ వాక్కు ద్వారా చెప్పలేకపోయారో, ఎలాంటి అనుభవాన్ని వేద వేదాంగాలు వ్యక్తం చేయలేక 'నేతి నేతి' అని ఘోషించాయో అలాంటి అవ్యక్తానందపు తలపు కదా నీ స్మరణ. అందుకేనేమో పదకవితా పితామహుడు అన్నమాచార్య స్వామి "నీ గుణగానామృతాన్ని సేవిస్తున్నానని – అందే అన్ని సుఖాలూ నిండిపోయాయని", ఆ ప్రేమ పరవశాన్ని కీర్తనగా మనకందించి తరించే మార్గాన్ని తెలియచెప్పారు. భాగవతుల జీవనసుధ – భగవంతుని గాథే కదా! 'అల్లా మాలిక్ హై', 'సర్వమూ ఈశ్వరకృప', 'సాయివంటి దైవంబు లేడోయి, లేడోయి' – తమ బిడ్డల కోసం సృష్టిని కూడా ప్రేమతో సవరించగల్గిన భాగవతులు తమ లీలా వినోదాల మాతృవాత్సల్యాన్ని భగవంతుని గొప్పతనంగానే చెపుతూ వచ్చారు. భగవంతుని ఉనికికి వీరు సాక్ష్యమా? లేక మన కళ్ళముందు కదలాడుతున్నా మనం అర్థం చేసుకోలేని భగవంతుని రూపమా? ఏమో ఏది ఏమైనా – ఎంత చెప్పుకున్నా, ఎంత విన్నా, ఎన్నిసార్లు చూసినా, ఎంత ఆలోచించినా తనివి తీరని, తన్మయ తాదాత్మ్యం – మమతానుబంధాల మాతృత్వం – ఈ మహాత్ముల సచ్చరితలు. అందుకే ఈ శీర్షిక గురుకృపా'లహరి' – 'గురుకృప' అనే పెద్ద 'అల'గా పిలుచుకోవడం కంటే మరో ఉపమానం సరైనది కాదేమో! మా గురుదేవులు – పూజ్యపాదులు శ్రీబాబూజీ మాకు చూపిన బాటలో నడిచే క్రమమే మహాత్ముల, సచ్చరిత్రల అమృతపానము. సద్గురు చంద్రుని గొప్పతనం ఏమంటే భగవంతుని దర్శించుకోవడానికి ఆయాక్షేత్రాలను దర్శించడం ఒక ఎత్తయితే – కరచరణాదులతో కదలాడిన భగవంతుడు, నడయాడే దైవం అయిన పరమాచార్యస్వామి వారి పాదం తాకిన ప్రతీ ప్రాంతమూ మానసహంసికా దర్శనం గావిస్తూ ఆ అనుగ్రహ క్షేత్ర పురుషునితో అడుగు వెనుక అడుగు వేయడం. ఇదే కదా గురుమహిమ. పరమాచార్య స్వామివారి 'పద' పయనంలోకి మనమూ వెళ్దామా?

1935వ సం॥ ఏప్రిల్ 2వ తేదీ పరమచార్య స్వామివారు గయ పయనమవుతూ కాస్తర్ మహాదేవుని సన్నిధిలోని ఈశ్వరుని దర్శించి, నమస్సులర్పించారు. ఇక్కడ ఎంతోమంది వంద సంవత్సరాల



వయస్సుపైబడిన వారిని దర్శించవచ్చు. కంచిమఠ పూర్వాచార్యులచే దీవెనలందుకున్న దండి బాబా ఇక్కడ ఒక ఆశ్రమాన్ని, భక్త వసతి గృహాన్ని, ఆలయాన్ని నిర్మించారు. స్వామివారిని దండి బాబా ఎంతో భక్తిపూర్వకంగా ఆహ్వానించి, గౌరవ మర్యాదలతో మఠమునకు దగ్గరుండి తోడ్కొని వెళ్ళారు.

ఆశ్రమంలో వసిస్తున్న పండితులందరూ కలిసి స్వామి వారి కీర్తిని ప్రతిబింబించే స్వాగతోపన్యాసం చేసారు. సూరజ్‌పుర మహరాజుగారి పాదపూజను స్వీకరించి కాశీకి 250 మైళ్ళ దూరంలో ఉన్న 'అరా' అనే పట్టణం చేరారు స్వామి. అక్కడి వేలమంది ప్రజానీకం స్వామివారి ఆశీస్సులనందుకున్నాక జరిగిన పండిత సభలో స్వామివారి గోష్ఠి హిందీలో సాగింది. స్వామివారి ప్రసన్నతకు, ఎంతో అనర్గళంగా, అనునయంగా సాగిన వారి హిందీ భాషణానికి భక్తులు పరవశం చెందారు. వారి 'గురుభక్తి'ని స్వామివారు ప్రశంసించారు. 'సోన్' నది – గంగతో కలిసే ప్రదేశం సోనాభద్రగా పిలువబడుతుంది. ఇది పాట్నాకు పశ్చిమంగా పదిహేను మైళ్ళ దూరంలో ఉంది. ఈ నదిలో దొరికే రాళ్ళు వినాయకుని పోలి ఉంటాయి. స్వామివారు ఇక్కడ పవిత్ర స్నానాలాచరించడంతోపాటు, స్వామే నదిలోనికి ఈదుకుంటూ వెళ్ళి, కొన్ని రాళ్ళను తీసుకురావడం గుర్తుండిపోయే విషయం. తానాపూర్ మీదుగా స్వామివారు ఏప్రిల్ 24వ తేదీ, 1935వ సం॥ ఇప్పుడు 'పాట్నా'గా పిలుచుకునే పాటలీపుత్రను పావనం చేసారు. ఆరోజు సాయంత్రం వేలాది భక్తజనులతోపాటు అమోన్, అత్వా ప్రాంతాల మహరాజులు స్వామివారికి ఎదురేగి సభక్తికంగా స్వాగతించారు. రాజలాంఛనాలతో, సైనికుల కవాతులతో దేదీప్యమానమైన పాట్నా నగరంలో ఒక ఎత్తైన వేదికను నిర్మించారు–స్వామివారి దర్శనాన్ని వేలాదిమంది ఇబ్బంది లేకుండా చేసుకునేందుకు. పాటలీపుత్ర పట్టణంలోని ఆధ్యాత్మిక, అధికార, అనధికార సంస్థలెన్నో తమ స్వాగత పత్రాలను సమర్పించుకున్నారు హిందీ, సంస్కృత భాషలలో. బీహార్ రాష్ట్రమంతా స్వామివారి రాకను ఎంతో స్మరించుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుండి భక్తజనం స్వామి విడిదిని చేరి దర్శన ఆశీస్సులను పొందారు. ఆనాటి పత్రికలలో పతాకస్థాయిలో స్వామిరాకను గురించి వారి కీర్తిని తెలియచెపుతూ శీర్షికలు ప్రచురితమయ్యాయి. 'అద్వా' మహరాజు, రాణిగారు స్వామి సేవకు ఎక్కడా ఆటంకం లేకుండా చూసుకున్నారు. ఆ సంవత్సరం శంకరజయంతి గంగాతీరంలోని భాగీరథి భవనంలో జరిగింది. వేద, నాద స్వరాలతో ఎంతో వేడుకగా మఠ ఏనుగుపై ఆదిశంకరుల చిత్రపటము, పాదుకలను ఉంచి ఊరేగింపుగా స్వామివారు భక్త జనులతో కలసి



వెనుక నడుస్తూ రాగా గంగా తీరం చేరారు. అక్కడి శంకరుల పాదుకలకు స్వామివారు అభిషేకం చేసారు. భక్తజనులనుద్దేశించి పరమాచార్యస్వామి వారు హిందీలో చేసిన అనుగ్రహభాషణంతో పాట్నావాసుల ఆనందానికి మేర లేకుండా పోయింది. తర్వాతిరోజు పాట్నా పండితసభ ఆధ్వర్యంలో భిక్షావందనం ఏర్పాటు చేయబడింది. హైకోర్టు పూర్వ, ప్రస్తుత న్యాయమూర్తులు, చీఫ్ ఇంజనీర్లు ఎందరో స్వామివారిని సేవించుకున్నారు. స్వతంత్ర భారతదేశ తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్‌గారు వారి కుటుంబంతో కలసి స్వామివారిని దర్శించుకున్నారు పాట్నా నగరంలో. తిహారి మహరాజ్ ఆధ్వర్యంలో మహంతులు, పురోహితులు, ప్రజలు ఎదురురాగా, స్వామివారు 'గయ' ప్రవేశించారు. అక్కడి ఫల్గుణి నదిలో స్నానమాచరించి విష్ణుపాద సందర్శనం చేసుకున్నారు. పూర్వకాలంలో గయాసురుడు అనే రాక్షసుడు చేసిన తపస్సు ఫలితంగా విష్ణువు దర్శనమిచ్చి గయాసురుని చూచిన వారికి మోక్షమందునట్లు వరమిచ్చాడట. తద్వారా నైతిక జీవనము సరిగా లేని వారు కూడా గయాసురుని దర్శించి మోక్షపదము చేరడం మొదలిడిన వేళ గయాసురుని తలపై విష్ణువు పాదముంచి భూమిలోనికి నెట్టి వేశాడని చారిత్రకుల అభిప్రాయము. రామాయణ, భారతములలోను తర్వాత బౌద్ధమత విస్తరణలో గయ ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. గయ నుండి పరమాచార్య స్వామివారు బుద్ధగయకు పయనమయ్యారు. మహాబోధి ఆలయ ప్రధానార్చకులు, ప్రజలు స్వామివారి రాకను పురస్కరించుకొని బోధగయ ఊరి వెలుపలనే వేచి చూసి స్వాగత సత్కారాలతో ఆహ్వానం పలికారు. బోధగయ – 'సిద్ధార్థు'డైన యువరాజు అంతరంగంలో చెలరేగిన 'అసంపూర్ణత్వ భావన' అనే పెనుతుఫానుకు 'సంపూర్ణత్వం' లభించిన ప్రాంతంగా గుర్తు చేసుకోవచ్చు. బోధగయలోని మహాబోధి ఆలయ ప్రాంగణంలో బోధివృక్షం క్రింద ధ్యానంలో ఉండగా సిద్ధార్థునికి సంపూర్ణత్వం లభించి బుద్ధునిగా మారినట్లు చరిత్ర చెపుతుంది. మూడవ శతాబ్దంలో అశోక చక్రవర్తి అక్కడ ఆలయాన్ని నిర్మించినట్లు, తర్వాత కాలంలో గుప్తులకాలం నుండి – హ్యూయన్‌సాంగ్ వంటి చారిత్రక పరిశోధకుల వరకు ఈ ఆలయ నిర్మాణాన్ని, కాలానుగుణంగా వచ్చిన మార్పులను మనం రికార్డు చేయడం గమనించవచ్చు. పదమూడవ శతాబ్దకాలంలో కనుమరుగైన బౌద్ధం మరల పందొమ్మిదవ శతాబ్దంలో నవజవసత్వాలు పొందింది. ఎందరో యోగిపుంగవులు, మహాత్ములు, సంతుల పాదస్పర్శతో పునీతమైన మహాబోధి ఆలయప్రాంగణం ఎంతటివారికైనా మౌనానందాన్ని ప్రసాదించగలదనడంలో ఎట్టి అతిశయోక్తి లేదు. మూడురాత్రులు – మూడుపగళ్ళు మానసిక



తపస్సు తర్వాత బుద్ధునికి జ్ఞానోదయమయినట్లు – ఆ తర్వాత ఆ ప్రాంగణము చుట్టుప్రక్కల ఏడు స్థలాలలో – ఏడువారాల పాటు తాను పొందిన ఆ అనుభూతిని ఆస్వాదిస్తూ గడిపినట్లు బుద్ధుని చరిత్రలో మనం చూడవచ్చు. అన్వేషణకు ఆలవాలమైన బుద్ధుని జీవితం ప్రతీసాధకునికి ఒక దీపస్థంభమే. పరమాచార్యస్వామివారు అక్కడి బోధివృక్షాన్ని (రావిచెట్టు), బుద్ధుని ఆలయాన్ని, అక్కడ ఆదిశంకరులు ప్రతిష్ఠించిన శివలింగాన్ని సందర్శించారు. చారిత్రకుల వాదాలను, బేధాలను ఇక్కడ ప్రస్తుతించుకోవడం లేదు. ఏది ఏమైనా పరమాచార్యస్వామివారు మాత్రం అన్ని మతాల పట్ల, ధర్మాలపట్ల ఏకత్వభావమే కలిగి ఉండేవారన్నది నిర్వివాదాంశము. **అందుకే దలైలామా – పరమాచార్యులను "ఈ శతాబ్దపు నిజమైన సన్యాసి"గా అభివర్ణిస్తారు.**

ఇక్కడ ప్రస్తుతించుకోవాల్సిన మరో విశేషమేమంటే మా గురుదేవులు పూజ్యశ్రీసాయినాధుని శరత్‌బాబూజీ శ్రీచరణులు కూడా బోధివృక్షాన్ని – బోధగయ ప్రాంతాన్ని దర్శించడం మాకు ఎంతో ప్రేరణనిస్తోంది. పరిపూర్ణ దివ్యత్వం పొందిన మా గురుచంద్రులు–సాధకులు విధిగా పవిత్ర క్షేత్రాలను దర్శించుకోవాలని మాకు తెలియచేయడానికే ఈ క్షేత్రదర్శనాలు చేసారని అనిపిస్తుంది. ఆచరణే అభిమతంగా, ఆదర్శంగా జీవించిన అంతర్యామి మా గురుచంద్రులు.

గురువు అవనికి వచ్చిందే బిడ్డలను గమ్యం చేర్చడానికి కదా! మానవ జీవితాలను పరిపూర్ణంగా వినియోగించుకునేందుకు ఏదిసరైన దారో – ఆ దారిలో ఎదురయ్యే ప్రతీ అవరోధాన్ని అధిగమిస్తూ ఆ 'ఆనంద' స్వరూపుడైన దైవాన్ని (సాయిని) ఎలా చేరుకోవాలో ప్రతీ గడపకు వెళ్లి ప్రతీ మనిషిని ఉద్ధరించి, 'మనిషి దైవంగా' ఎదిగే క్రమాన్ని, వలసిన ధర్మాన్ని తాను ఆచరించి – మనచేత ఆచరింపచేసే మహితమూర్తి గురువు.

బోధ చేయడం కాదు – ఆచరించి చూపడం – ఆచరించిందే చెప్పడం ఇదీ సద్గురుపథం – తరించే ఆనందజీవన రథం. తలను చేతనుంచుకొని, మన తలపులకు తలుపులు వేసి – గురువు చూపిన బాటనే మన తనువున నిలుపుకొని త్రికరణాలను సద్గురు చరణాలకు అంకితం చేసి గురువనే 'పూర్ణ'చంద్రుని చేరే ప్రయత్నం చేద్దాం. **ఆశ్రయించిన జీవులు అడుగు వెనుకకు వేసిన దాఖలాలు లేవు. గురుచరణాలను పట్టుకొన్న వారికి అవరోధాలు రావు. ఇది తరించే చోటు... మనకు ఉండకూడనిది ఏమరుపాటు... సద్గురు చరణం శరణం.....**

**– గురుకృప**


# శరశ్చంద్రికలు



"బాబా అంటే ఈ దేహమేనని అనుకుంటే నువ్వు నన్నసలు చూడనట్లే! నీ జీవిత పర్యంతం నువ్వు నా ప్రక్కనున్నా ఉపయోగం లేదు".

– శ్రీసాయిబాబా

"బాబా ఇప్పుడు తమ భౌతిక దేహంతో లేరు. కనుక మేము ఆయనను పట్టుకోవాలంటే కష్టం. బాబా భౌతిక దేహానికి అతీతంగా ఏదో విధంగా మేము ఆయనతో సంబంధం కలిగి ఉండాలి. గురువుయొక్క భౌతిక రూపంతో మాత్రమే కాకుండా అంతరంగంలో కూడా వారితో సంబంధం కలిగి ఉండటానికి మార్గాలున్నాయా అంటే, నిజానికి ఇక్కడున్న వాళ్ళంతా రకరకాల మార్గాలలో చేస్తున్నది అదే! వారి జీవితాలను బాబాతో శృతి చేసుకొని, దానిని (ఆ సంబంధాన్ని) ఇంకా ఇంకా స్థిరం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. జీవితం యొక్క ప్రతి పార్శ్వంలో, ప్రతి అడుగులో, ప్రతి శ్వాసలో బాబాను అనుభూతి చెందడానికి ప్రయత్నిస్తున్నారు. అది అంతరంగికమే. బాబాను అనుసరించడమనుకునేది కూడా అంతరంగికమై ఉండాలి. ఆ అనుసరించడం అంతరంగంలోని తపనకు బాహ్యమైన వ్యక్తీకరణ. నీకు లోపల ఆ భావం లేకుండా కేవలం బాహ్యంగా అనుసరిస్తున్నంత మాత్రాన ఏమీ ప్రయోజనం లేదు. అందుకే బాబానే అన్నారు. "బాబా అంటే ఈ దేహమేనని అనుకుంటే నువ్వు నన్నసలు చూడనట్లే! నీ జీవిత పర్యంతం నువ్వు నా ప్రక్కనున్నా ఉపయోగం లేదు" అని. అదీ ఆయన చెప్పింది. బాహ్యమైన అనుసరణ, అంతరంగికమైన తపనకు వ్యక్తీకరణ కావాలి. నేను ముందు చెప్పినట్లు మన ప్రేమకు వ్యక్తీకరణ"



– శ్రీబాబూజీ శరశ్చంద్రికలు మొదటి భాగం




ఆడంబరమూ - బాహ్యవేశము - ఆర్భాటాలే మీ మతమా?
ఆస్తికులంటే తీరేనా? అస్తికలంటే శరీరమా?
శిలాగోపురం ఆలయమా? శిరగోపురమే అర్చనమా?
దేహమేరా దేవాలయం - జీవుడే సనాతన దైవం.

- శ్రీవేటూరి -